


నేడు సీఎం చంద్రబాబు విశాఖ రాక

విశాఖపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శుక్రవారం విశాఖ రానున్నారు. ఉదయం 7.30 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 8.50 గంటలకు రుషికొండ వద్ద గల హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ నుంచి రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళతారు. ఉదయం పది నుంచి 11.30 గంటల వరకు ఇంటర్నేషనల్ మీడియేషన్ సదస్సులో పాల్గొంటారు. అనంతరం 11.30 గంటలకు హోటల్ నుంచి తిరిగి రుషికొండ హెలిప్యాడ్‌కు చేరుకుని 11.40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి ఉండవల్లి వెళతారని అధికార వర్గాలు తెలిపాయి.

రిజర్వాయర్లు కళకళ

నిండుకుండల్లా జలాశయాలు

- ఇప్పటికే పెద్దేరు, రైవాడ, కోనాం గేట్లు ఎత్తివేత
- గరిష్ఠస్థాయికి చేరువలో తాండవ, కళ్యాణపులోవ రిజర్వాయర్లు
- చెక్‌డ్యామ్‌ల నుంచి కాలువలకు పుష్కలంగా నీరు
- పూర్తిగా నిండిన సాగునీటి చెరువులు
- ఆశాజనకంగా వరినాట్లు
- లక్ష్యాన్ని అధిగమిస్తామంటున్న వ్యవసాయ శాఖ అధికారులు



పూర్తిగా నిండిన పెద్దేరు జలాశయం



రాంబిల్లి మండలం నారాయణపురంలో ఇప్పటికే పూర్తయిన వరినాట్లు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అన్ని సాగునీటి జలాశయాలు నిండుకుండల్లా దర్శనమిస్తున్నాయి. గత నెల మూడో వారం నుంచి అడపాదడపా కురుస్తున్న భారీ వర్షాలతో పరీవాహక ప్రాంతాల నుంచి రిజర్వాయర్లలోకి వరద నీరు వచ్చిచేరుతున్నది. సుమారు నెల రోజుల నుంచి ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తుండగా, అంతకు మించి జలాశయాల్లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. రైవాడ, పెద్దేరు, కోనాం రిజర్వాయర్లు ఇప్పటికే పూర్తిగా నిండడంతో నీటి నిల్వలను క్రమబద్ధీకరిస్తూ, అదనపు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈ నెలాఖరు వరకు వర్షాలు కురిసే అవకాశం వుండడంతో తాండవ, కల్యాణపులోవ జలాశయాలు కూడా పూర్తిగా నిండుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రైవాడ జలాశయం నుంచి గురువారం 800 క్యూసెక్కులు, పెద్దేరు నుంచి 313 క్యూసెక్కుల నీటికి దిగువకు విడుదల చేస్తున్నట్టు జల వనరుల శాఖ అధికారులు వెల్లడించారు.

అనకాపల్లి జిల్లా, దీనికి ఆనుకొని వున్న అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గతకొద్ది రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో జలాశయాల్లోకి భారీగా వరద నీరు చేరుతున్నది. ఆయకట్టుకు రోజువారీ అవసరాలకు మించి వరద నీరు వస్తుండడంతో రిజర్వాయర్లు త్వరగా నిండాయి. దీంతో అధికారులు స్పిల్‌వే గేట్లు ఎత్తి, అదనపు నీటిని నదుల్లోకి విడుదల చేస్తున్నారు. చెక్‌డ్యామ్‌ల నుంచి కాలువలకు పుష్కలంగా నీరు ప్రవహిస్తుండడంతో అనకాపల్లి, మునగపాక, కశింకోట, ఎలమంచిలి, రాంబిల్లి, ఎస్.రాయవరం, తదితర మండలాల్లో వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదే సమయంలో సాగునీటి చెరువులు కూడా పూర్తిగా నిండాయి. గత మూడు వారాల్లో పలుమార్లు కురిసిన భారీ వర్షాలతో లోతట్టు మెట్ట భూముల్లో కూడా నీరు నిలిచింది. దీంతో వర్షాధార భూముల్లో కూడా రైతులు వరినాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి 54,465 హెక్టార్లలో వరి సాగు లక్ష్యంకాగా, ఇంతవరకు 47 వేల హెక్టార్లలో పూర్తయ్యాయని, వర్షాలు అనుకూలించడంతో లక్ష్యానికి మించి వరిసాగు అయ్యే అవకాశం వుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

జలాశయాల్లో గురువారం సాయంత్రానికి ఉన్న నీటి నిల్వలు..

జలాశయం	గరిష్ఠ నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం
తాండవ	380 అడుగులు	375.5 అడుగులు
రైవాడ	114 మీటర్లు	113.45 మీటర్లు
కోనాం	101.25 మీటర్లు	99.5 మీటర్లు
కల్యాణపులోవ	460 అడుగులు	450.35 అడుగులు
పెద్దేరు	137 మీటర్లు	136.5 మీటర్లు

ఏసీబీ వలలో నర్సింగబిల్లి వీఆర్వో

- మ్యుటేషన్‌కు రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



వీఆర్వో శ్రీసూర్యకృష్ణ పృథ్వీ

కశింకోట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్సింగబిల్లి వీఆర్వో శ్రీసూర్యకృష్ణ పృథ్వీ ఏసీబీ వలకు చిక్కారు. మ్యుటేషన్ పూర్తి చేసేందుకు ఓ రైతు నుంచి రూ.20 వేల తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఏసీబీ డీఎస్పీ బి.వి.ఎస్.నాగేశ్వరరావు స్థానిక విలేకరులకు తెలిపిన వివరాలిలా వున్నాయి.

నర్సింగబిల్లి గ్రామానికి పూడి నాగేశ్వరరావుకు తల్లి నుంచి వారసత్వంగా 2.10 ఎకరాల భూమి సక్రమించింది. తన పేరు మీద మ్యుటేషన్ చేసేందుకు గత నెలలో తహసీల్దారు కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నారు. మ్యుటేషన్ చేయాలంటే రూ.40 లంచం ఇవ్వాలని వీఆర్వో గన్నమరాజు శ్రీసూర్యకృష్ణ పృథ్వీ డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని చెప్పడంతో రూ.20 వేలకు మించి తగ్గించేది లేదని వీఆర్వో స్పష్టం చేశారు. అయితే లంచం ఇవ్వడం ఇష్టంలేని నాగేశ్వరరావు ఈ నెల 2వ తేదీన ఏసీబీ అధికారులను సంప్రదించారు. వారు చెప్పిన ప్రకారం వీఆర్వోకు ఫోన్ చేసి, రూ.20 లంచంగా ఇవ్వడానికి సిద్ధంగా వున్నానని, ఎక్కడికి వచ్చి ఇవ్వాలని అడిగారు. ఆయన చెప్పిన మేరకు గురువారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో జట్టపురెడ్డితుని, నర్సింగబిల్లి గ్రామాలకు చెందిన సచివాలయానికి నాగేశ్వరరావు నగదుతో వెళ్లారు. వీఆర్వో డబ్బులు తీసుకుంటుండగా అప్పటికే సమీపంలో మాటు వేసిన ఏసీబీ అధికారులు దాడి చేసి రెండ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచడానికి తీసుకెళ్లారు.

ఎరువుల కొరత లేదు

రైతుల అవసరాల మేరకు ప్రభుత్వం సరఫరా చేస్తున్నది

- ఆర్డీవో షేక్ ఆయిషా
- ఎక్కువ ధరకు ఎరువులు అమ్మితే డీలర్ల లైసెన్సు రద్దు చేస్తాం
- వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు



దేవరాపల్లి రైతు సేవా కేంద్రంలో యూరియా స్టాక్ రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో షేక్ ఆయిషా, వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్‌రావు

దేవరాపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల కొరత లేదని, అన్ని మండలాల్లో రైతులకు అవసరాకు సరిపడ నిల్వలు వున్నాయని అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయిషా తెలిపారు. యూరియా కోసం రైతులు ఇబ్బంది పడుతున్నట్టు ఒక పత్రికలో (ఆంధ్రజ్యోతి కాదు) వచ్చిన వార్తపై జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు ఆర్డీవోతోపాటు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్‌రావు, మండల ప్రత్యేక అధికారి మంజులావాణి గురువారం ఇక్కడకు వచ్చి రైతు సేవా కేంద్రంలో తనిఖీలు చేశారు. మండలానికి ఇంతవరకు వచ్చిన ఎరువులు, రైతులకు అందజేసిన ఎరువులకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదని చెప్పారు. వ్యవసాయ శాఖ ఇచ్చిన ఇండెంట్‌ల మేరకు రైతు సేవా కేంద్రాలకు, పీఏసీఎస్‌లకు యూరియా సరఫరా చేశామన్నారు. ఒకవేళ అదనంగా ఎరువులు అవసరమైతే వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలని, సత్వరమే ఎరువులు పంపడానికి చర్యలు చేపడతామని ఆమె చెప్పారు.

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.మోహన్‌రావు మాట్లాడుతూ, దేవరాపల్లి మండలంలో పది వేల ఎకరాల్లో వరినాట్లు వేశారని, 19 రైతు సేవా కేంద్రాలకు 760 టన్నులకుగాను ఇంతవరకు 540 టన్నుల యూరియా సరఫరా అయ్యిందని వివరించారు. రెండు, మూడు రోజుల్లో 52 టన్నుల యూరియా వస్తుందని, షెడ్యూల్ ప్రకారం ఈ నెల రెండవ ... మిగతా 4వ పేజీలో

నిరంతరం యూరియా సరఫరా: కలెక్టర్

అనకాపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని యూరియా సరఫరా నిరంతరంగా కొనసాగుతుందని కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మార్క్‌ఫెడ్, ప్రైవేట్ డీలరుల్ల, పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాల్లో 895.11 టన్ను యూరియా అందుబాటులో ఉందన్నారు. పది రోజుల్లో మరో 1,500 టన్నుల యూరియా జిల్లాకు రానున్నదని చెప్పారు. ఈ నెలలో ఇప్పటికే రైతు సేవా కేంద్రాలకు 730 టన్నులు, ప్రైవేటు డీలర్లకు 294 టన్నులు సరఫరా అయ్యిందని, ఐదో తేదీన కోరమాండల్ నుంచి 250 టన్నుల యూరియా వస్తుందని వెల్లడించారు. ఈ నెల రెండు, మూడు వారాల్లో మరింత యూరియా జిల్లాకు రానున్నదని, అందువల్ల రైతులు అవసరాలకు మించి ఎరువులు కొనుగోలు చేయవద్దని కలెక్టర్ కోరారు.



పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న స్వయంభూ విఘ్నేశ్వరుడు

పుష్పాలంకరణలో స్వయంభూ విఘ్నేశ్వరుడు

గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన గురువారం చోడవరం విఘ్నేశ్వరాలయంలో స్వయంభూ గణేశుడు పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చకులు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో పూజాధికాలు నిర్వహించారు. తరువాత భక్తులు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. కాగా గురువారంతో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి.

-చోడవరం/ ఆంధ్రజ్యోతి

గ్రామ సింహాల బెడద

ప్రధాన రహదారులు, వీధుల్లో గుంపులుగా సంచారం

- నానాటికీ పెరిగిపోతున్న శునకాల సంతతి
- రోడ్లపైకి రావడానికి భయపడుతున్న జనం



అచ్యుతాపురం ప్రధాన రహదారిలో గుంపుగా చేరిన కుక్కలు

అచ్యుతాపురం/ అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం, మోసయ్యపేట, వెదురువాడ పంచాయతీలు, పూడి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పరిసరాల్లో గ్రామ సింహాలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా ప్రధాన రహదారులు, వీధుల్లో గుంపులుగా సంచరిస్తున్నాయి. పక్కనే వున్న మునగపాక మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో అక్కడి నుంచి పలు కుక్కలు అచ్యుతాపురం మండలంలోకి వచ్చేస్తు న్నాయి. రహదారులపై గుంపులుగా సంచరిస్తుండడంతో ఎక్కడ తమపై దాడి చేస్తాయోనని చిన్నారులు, వృద్ధులు, మహిళలు భయపడుతున్నారు. పంచాయతీ సిబ్బంది గతంలో ఏడాదికి ఒకసారి కుక్కలను పట్టి, దూరంగా కొండప్రాంతాల్లోకి తీసుకెళ్లి విడిచిపెట్టేవారు. అయితే దీనిపై కొన్ని స్వచ్ఛంద సంస్థలు కోర్టులో పిటిషన్ వేయడంతో పంచాయతీ సిబ్బంది అప్పటి నుంచి కుక్కల పట్టివేతను నిలుపుదల చేశారు. దీంతో గ్రామాల్లో కుక్కల సంతతి విపరీతంగా పెరిగిపోతున్నది. రాత్రిపూట విధులకు హాజరయ్యే ఉద్యోగులు, అదే విధంగా విధులు ముగించుకుని ద్విచక్ర వాహనాలపై ఇళ్ల వెళ్లే ఉద్యోగులు కుక్కల గుంపులను చూసి భయపడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. వీధి కుక్కలు కరిస్తే.. ర్యాబిస్ వ్యాధిబారిన పడే ప్రమాదం వుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాగా కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని ఐద్వా మండల కన్వీనర్ ఆర్.లక్ష్మి గురువారం ఎంపీడీఓ చిన్నారావుకు వినతిపత్రం అందించారు.



షాపుల వద్ద విశ్రమించిన గ్రామ సింహాలు

ఉత్తమ అధ్యాపకునిగా చిన్నారావు ఎంపిక

- వడ్డాది కళాశాల ప్రిన్సిపాల్‌కు రాష్ట్రస్థాయి పురస్కారం



జి.చిన్నారావు

నర్సీపట్నం/ బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గెడ్డమూరి చిన్నారావు రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకునిగా ఎంపికయ్యారు. ఈ ఏడాది అనకాపల్లి జిల్లా మొత్తం మీద ప్రభుత్వ కళాశాలల నుంచి చిన్నారావు ఒక్కరే కావడం విశేషం. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అమరావతిలో జరిగే కార్యక్రమంలో ఆయన పురస్కారాన్ని అందుకోనున్నారు.

కోటవురట్లకు చెందిన చిన్నారావు విజయనగరం జిల్లా నెలిమర్లలో ఇంటర్, విజయనగరం ఎంఆర్ కళాశాలలో డిగ్రీ చదివారు. పీజీ ఏయూలో చేశారు. తిరుపతి ఎస్వీయూ నుంచి ఎంఫిల్ పట్టా పొందారు. 1998లో విజయనగరం జిల్లాలో ... మిగతా 4వ పేజీలో

ఆటో బోల్తా పడి విద్యార్థి మృతి

- అడ్డుగా వచ్చిన పందిని తప్పించే క్రమంలో ప్రమాదం
- ముగ్గురు ప్రయాణికులకు గాయాలు



ఆంటోని ఆకాశ్ (ఫైల్ ఫొటో)

కొత్తూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): **అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ కృష్ణాపురం కాలనీ ప్రధాన రహదారిపై ఆటో బోల్తా పడిన ప్రమాదంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి మృతిచెందాడు. మరో ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఆకస్మికంగా రోడ్డుపైకి వచ్చిన పందిని తప్పించే క్రమంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడినట్టు డ్రైవర్ చెప్పారు. ఈ ప్రమాదానికి సంబంధించి ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాలిలా వున్నాయి.**

కొత్తూరు పంచాయతీ రామాపురం కాలనీకి చెందిన క్రిస్టోఫర్, ఉషా దంపతులకు కుమారుడు ఆంటోని ఆకాశ్(14), కుమార్తె అనీషా ఉన్నారు. ఇద్దరూ ఏఎంఏఎ హైస్కూల్‌లో చదువుతున్నారు. రోజూ ఇంటి నుంచి ఆటోలో పాఠశాలకు వెళ్లివస్తుంటారు. గురువారం ఉదయం స్కూలుకు వెళ్లేందుకు అన్న, చెల్లెలు ఆటో ... మిగతా 4వ పేజీలో

రక్తదానంలో రికార్డు

స్పీకర్ అయ్యన్నపాత్రుడు పుట్టిన రోజు సందర్భంగా పలుచోట్ల శిబిరాలు

- 1,046 మంది నుంచి రక్త సేకరణ
- ఘనంగా అయ్యన్న జన్మదిన వేడుకలు



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో కేక్ కట్ చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు


నర్సీపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'రక్తదానం చేయండి. ప్రాణ దాతలు కండి' అని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇచ్చిన పిలుపుతో పెద్ద ఎత్తున రక్త దాతలు స్పందించారు. రికార్డులో స్థాయిలో 1,046 మంది ముందుకు వచ్చి రక్తదానం చేశారు. అయ్యన్నపాత్రుడు పుట్టిన రోజు సందర్భంగా ఏటా రక్తదానం శిబిరాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ దఫా ఏకంగా నాలుగుచోట్ల మెగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రాంతీయ ఆస్పత్రిలో విశాఖపట్నం ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, ఏరియా ఆస్పత్రి బ్లడ్ సెంటర్, ప్రైవేటు బ్లడ్ బ్యాంక్‌కి సంబంధించిన మూడు శిబిరాలు ఏర్పాటు చేశారు. ఇక్కడకు గొలుగొండ, నాతవరం, నర్సీపట్నం ప్రాంతాలకు చెందినవారు వచ్చి రక్తదానం చేశారు. పెదబొడ్డేపల్లి మార్కెట్ యార్డులో పెదబొడ్డేపల్లి, బలిఘట్టం, మాకవరపాలెం ప్రాంతాల నుంచి వచ్చిన వారు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో రక్త దానం చేశారు. తొలుత ఏరియా ఆస్పత్రిలో స్పీకర్ ... మిగతా 4వ పేజీలో



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్

జిల్లాలో 39 మంది ఉత్తమ గురువులు

నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పురస్కారం



అనకాపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 39 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అనకాపల్లి గుండాల జంక్షన్‌లో వున్న ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ విజయకృష్ణన్ అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం, అవార్డుల బహూకరణ వుంటాయని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు హాజరవుతారని చెప్పారు.

స్కూల్ అసిస్టెంట్స్ విభాగంలో ఉత్తమ ఉపాధ్యాయులు..

డి.సంజీవ కుమార్ జడ్పీ హెచ్‌ఎస్ సోమలింగపురం, ఎలమంచిలి మండలం; ఎస్.సోమేశ్, జడ్పీ హెచ్‌ఎస్ తురువోలు, చీడికాడ మండలం; ఎస్.మురళీకృష్ణ, జడ్పీ హెచ్‌ఎస్, కె.కోటపాడు; పీవీజీఎన్ గంగాధర్, జడ్పీ హెచ్‌ఎస్, గౌరీపట్నం, చోడవరం మండలం; అలమండ వి.రామాచార్యులు, జడ్పీహెచ్‌ఎస్, ఎస్.రాయవరం; తిల్లపూడి వెంకటరమణ, జడ్పీహెచ్‌ఎస్, చోద్యం, గొలుగొండ మండలం; కె.వీరభద్రరావు, ఎంపీయూపీ స్కూల్, పి.బయ్యవరం, ఎలమంచిలి మండలం; సీహెచ్ నాగరత్నం, కేపీపురం, ఎలమంచిలి; రాళ్లపల్లి దేముడు, జడ్పీహెచ్‌ఎస్, చౌడువాడ, కె.కోటపాడు మండలం; డి.పెంటారావు, జడ్పీహెచ్‌ఎస్, నాతవరం; ఎలిశెట్టి రామారావు, డీపీఎన్ జడ్పీహెచ్‌ఎస్, కశింకోట; తెనాలి రవికుమార్, జడ్పీహెచ్‌ఎస్, గుంటపల్లి, పాయకరావుపేట మండలం; డి.రవి, జడ్పీ హెచ్‌ఎస్, మాకవరపాలెం; సీహెచ్ సత్తిబాబు, జడ్పీ హెచ్‌ఎస్, టీటీ పట్నం, రోలుగుంట మండలం; ఎస్.సత్యారావు, జడ్పీ హెచ్‌ఎస్, గునుపూడి, నాతవరం మండలం; ఆర్‌వీవీ సత్యనారాయణ, ఎంపీఎస్, కొత్తకోట, రావికమతం మండలం; పి.అచ్చమ్మ, జడ్పీహెచ్‌ఎస్, పెదబొడ్డేపల్లి, నర్సీపట్నం టౌన్; టి.మాణిక్యం, జడ్పీహెచ్‌ఎస్, జోగంపేట, గొలుగొండ మండలం; డి.సుబ్రమణ్యేశ్వరరావు ... మిగతా 4వ పేజీలో

ఎలమంచిలిలో పుష్కలంగా యూరియా

ఎలమంచిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో రైతాంగానికి పుష్కలంగా యూరియా అందుబాటులో ఉందని మండల ప్రత్యేకాధికారి ప్రసాద్ తెలిపారు. గురువారం పట్టణంలోని వ్యవసాయాధికారి కార్యాలయానికి దిగుమతి అయిన యూరియా నిల్వలను అధికారుల బృందం పరిశీలించింది. వ్యవసాయాధికారి మోహనరావు మాట్లాడుతూ మండలంలో ఖరీఫ్‌లో వరి విస్తీర్ణం 5,330 ఎకరాలు కాగా, ఇప్పటివరకూ 3,100 ఎకరాల్లో నాట్లు వేశారన్నారు. ఇప్పటి వరకు 283 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందించామన్నారు. ఎలమంచిలి, లైనుకొత్తూరు, పేకిళ్లపాలెం, పులపర్తిల్లో ప్రస్తుతం 30 మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు వరహాలు, ఎంపీడీఓ కేఎస్. కొండలరావు, ఎస్ఐ ఉపేంద్ర పాల్గొన్నారు.

నియోజకవర్గంలో పది వేల సోలార్ కనెక్షన్లు

▸▸ ఎమ్మెల్యే విజయకుమార్

అచ్యుతాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి నియోజకవర్గంలో కనీసం పది వేల రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటుచేయాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టిందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. గురువారం స్థానిక ఏపీఐఐసీ కార్యాలయంలో నియోజకవర్గ అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సిబ్బంది తమ పరిధిలో గల గ్రామాల్లో సూర్యఘర్ పథకం గురించి సంపూర్ణంగా వివరించాలన్నారు. సోలార్ వినియోగంతో విద్యుత్ బిల్లులు తగ్గుతాయని తెలియజేయాలన్నారు. అలాగే అచ్యుతాపురం-అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులు పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీఆర్‌పీలకు శిక్షణ తరగతులు

నక్కపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి ట్రైనింగ్ సెంటర్‌లో నియోజకవర్గంలోని కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు (సీఆర్‌పీలు)కు గురువారం ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సీతారామరాజు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సీఆర్‌పీకి కేటాయించిన వెయ్యి ఇళ్ల నుంచి తడి,పొడి చెత్తను ఎలా సేకరించాలో అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన సీఆర్‌పీలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, స్థానిక సర్పంచ్ జయరత్నకుమారి, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సెక్రటరీ రాజశేఖర్, ఎం.శ్రీనివాస్, చిన్నంనాయుడు, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై అఘాయిత్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మునగపాక, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా బాలల సంరక్షణ సామాజిక అధికారిణి కేఎల్‌వీ.రమ్య పిలుపునిచ్చారు. మండలంలో వాడ్రాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జరిగినఅవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమన్నారు. వాటిని ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, తల్లులు పాల్గొన్నారు.

సీతానగరానికి తీరనున్న రహదారి కష్టాలు

నక్కపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీ జగన్నాథపురం, సీతానగరం గ్రామస్థులకు గత కొన్నేళ్ల నుంచి వున్న రహదారి కష్టాలు తీరనున్నాయి. ఉపాధి నిధులు రూ. 6.5లక్షలతో సీసీ రహదారుల పనులను గురువారం ప్రారంభించారు. రహదారులు సరిగా లేకపోవడంతో వర్షం కురిసినప్పుడు రోడ్లపై నీరు నిలిచిపోయేది. దీనివల్ల ప్రజలు ఇబ్బందులకు గురయ్యేవారు. ఉప సర్పంచ్ మారిశెట్టి నానాజీ, మాజీ సర్పంచ్ నానేపల్లి రాఘవులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాలగణపతిని దర్శించుకున్న ధర్మశ్రీ

ఎలమంచిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన బాలగణపతిని వైసీపీ నేతలు కరణం ధర్మశ్రీ, ఎంపీపీ బోదెపు గోవింద్, తదితరులు దర్శించుకున్నారు. స్థానిక కౌన్సిలర్ ఈరిగల గణేష్ వారిని సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు బొద్దపు యర్రయ్యదొర, మునిసిపల్ వైస్ చైర్మన్ గుప్తా, నేతలు దూది నరసింహమూర్తి, కౌన్సిలర్ సంతోష్, నేతలు గొంపాన శివ, చంటి, ఈశ్వరరావు, నరసింహారావు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి సమరయోధుల చిత్రపటాలు వితరణ

ఎలమంచిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గ్రంథాలయానికి స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలను పౌరసేవా సంఘం ప్రతినిధులు పుల్లా వెంకట్రావు, రంగా చిన వెంకటస్వామి తదితరులు గురువారం గ్రంథాలయాధికారి ఆనంద్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జి.సత్యనారాయణ, ఎలమంచిలి అప్పారావు, గొరపల్లి నరసింహ కాళిదాసు, కోన శంకర్రావు, ఆడారి పూరి జగన్నాథం పాల్గొన్నారు.

17న విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించాలి

ఎలమంచిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీన విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని సమరసతా సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర ప్రతినిధి ఏ. గంగాధర్ అన్నారు. గురువారం పట్టణంలోని బస్టాండ్ వద్ద సాయిబాబా ఆలయ ఆవరణలో నిర్వహించిన ఎస్ఎస్ఎఫ్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వకర్మ దేవతల ఆయుధాలు, భవన ప్రాకారాలు, వాహనాలు రూపొందించిన మహాత్ముడు అని, ఆ వృత్తి పనులు నిర్వహించే వారిని ఘనంగా సత్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బి. సత్యవతి, సహ కన్వీనర్‌లు మల్లికార్జునరావు, నరసింగరావు, వరలక్ష్మి, మండల సభ్యులు సత్యనారాయణ, సతీష్, నూకరత్నం పాల్గొన్నారు.

ఓవర్ లోడ్ వాహనాల సీజ్

పాయకరావుపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓవర్ లోడ్‌తో వెళుతున్న మూడు వాహనాలను గురవారం పట్టణ పోలీసులు సీజ్ చేశారు. ఇందుకు సంబంధించి సీఐ జి.అప్పన్న అందించిన వివరాలిలా ఉన్నాయి. గురువారం పట్టణ పరిధిలోని తాండవ జంక్షన్, వై జంక్షన్ తదితర ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను తనిఖీచేసి సరుకులు అధిక లోడ్‌తో వెళుతున్న మూడు మినీ వాహనాలను సీజ్‌చేశారు. వీటిపై కేసు నమోద చేసినట్టు సీఐ అప్పన్న తెలిపారు.

రిజిస్ట్రేషన్ల స్లాట్‌లు పెంచండి

▸▸ జిల్లా రిజిస్ట్రార్‌కు వైస్ ఎంపీపీ వినతి

నక్కపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో రోజువారీ స్లాట్లను పెంచాలని వైస్ ఎంపీపీ వీసం నానాజీ కోరారు. గురువారం నక్కపల్లి వచ్చిన జిల్లా రిజిస్ట్రార్ మన్మధరావును వీసం నానాజీ, తదితరులు కలిసి వినతి పత్రం అందజేశారు. రోజుకు నక్కపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి 39 స్లాట్లు మాత్రమే కేటాయించారని, వీటిని మరింత పెంచాలని కోరారు. స్లాట్లు దొరక్క క్రయ,విక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ విషయాన్ని పరిశీలించి, నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ చెన్నా నర్సింహమూర్తి, గొడుగుల బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రశాంతిలో సైన్స్ అండ్ ఇండిజీనియస్ టెక్నాలజీ ఆన్ వీల్ ప్రాజెక్టు ప్రారంభం

అచ్యుతాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో సైన్స్ అండ్ ఇండిజీనియస్ టెక్నాలజీ ఆన్ వీల్ ప్రాజెక్ట్‌ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శుక్రవారం ప్రారంభిస్తారని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగం ఆర్థిక సహకారంతో కొనసాగే ఈ సైన్స్ ప్రాజెక్ట్ ఏడాదిపాటు అన్ని విద్యా సంస్థల్లో విద్యార్థులకు స్వదేశీ సాంకేతికత- వికసిత్ భారత్ అనే అంశంపై అవగాహన కల్పిస్తుందన్నారు. ఈకార్యక్రమానికి జాతీయ పరిశోధన అభివృద్ధి సంస్థ హెడ్ డాక్టర్ బిశ్వకుమార్ సాహు, మైభారత్ జిల్లా అధికారి మహేశ్వరరావు, పరవాడ డీఎస్‌పీ విష్ణు స్వరూప్ హాజరవుతున్నట్టు ఆయన తెలిపారు.

మూర్తీభవించిన సేవకుడు

▸▸ ఓ ఉపాధ్యాయుడి సృజన సృష్టి

▸▸ రెండున్నర దశాబ్దాలుగా విద్యా రంగానికి విశేష సేవలు

▸▸ మార్గదర్శకునిగా ఉపాధ్యాయుడు ఏవీఎన్.మూర్తి



మునగపాక, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో పాటిపల్లికి చెందిన ఉపాధ్యాయుడు ఏవీఎన్.మూర్తి రెండున్నర దశాబ్దాలుగా విద్యారంగానికి సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సుమారు పాతికేళ్ల క్రితం ఉపాధ్యాయ వృత్తి చేపట్టిన మూర్తి విద్యా ప్రమాణాలు పెంపు లక్ష్యంగా 'మా ఊళ్లో వేసవి' పేరుతో సామాజిక బోధనకు శ్రీకారం చుట్టారు. మంచి ఫలితాలు ఇవ్వడంతో అది కొనసాగిస్తూనే ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు పోషక విలువలు పెంపుపై దృష్టి సారించాడు. కార్యక్రమాన్ని మెచ్చి అనేకమంది ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి భాగస్వాములయ్యారు. దీంతో స్పందించే హృదయం ఛారిటబుల్ ట్రస్టును స్థాపించి సేవలను విస్తరించారు. పోషకాహారం పంపిణీ పథకం ఎలమంచిలి, పెందుర్తి, అనకాపల్లి నియోజకవర్గాలకు విస్తరించింది. ఎన్ఎంఎంఎస్‌తో పాటు పాలిటెక్నిక్ తదితర కోర్సులకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తూనే ఉన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం విరివిగా మొక్కలు నాటడం, మట్టి వినాయక విగ్రహాలు, క్లాత్, నూలు సంచులు పంపిణీతోపాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తూనే ఉన్నారు. అంతేకాకుండా తన సోదరుడు భాగస్వామ్యంతో పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఉపకార వేతనాలు కూడా అందజేస్తున్నారు. ఉత్తమ ఉపాధ్యాయుడుగాను, సేవకుడుగాను ఏవీఎన్.మూర్తి అవార్డులు, ప్రశంసలందుకున్నారు.

గురువులకు కళావందనం

▸▸ చెక్కపై సుందర దృశ్యం



చెక్కపై స్టూడెంట్‌కు గురువు బోధిస్తున్న దృశ్యం

నక్కపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి తన సృజనాత్మకతతో అద్భుత దృశ్యాన్ని తయారు చేశాడు. చెక్కపై స్టూడెంట్‌కు విద్యాబోధన చేస్తున్న గురువు రూపాన్ని ఎంతో చక్కగా చెక్కాడు. అదేవిధంగా సుద్దముక్కను పెన్సిల్ మాదిరిగా తయారు చేసి, దానిపై టీచర్ అనే ఆంగ్ల అక్షరాలను చెక్కాడు. ఈ కళారూపాన్ని తయారు చేయడానికి తనకు 2 గంటలు సమయం పట్టిందని రవి చెప్పాడు.

ఆకట్టుకున్న విద్యార్థినుల విన్యాసం

ఎలమంచిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని బాలికోన్నత ప్లస్ స్కూలు విద్యార్థినులు చేసిన విన్యాసం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. గురువారం స్కూలు ఆవరణలో వ్యాయామ ఉపాధ్యాయుడు మూర్తి పర్యవేక్షణలో విద్యార్థినులంతా టీచర్స్ డే అంటూ చేసిన విన్యాసం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హెచ్ఎం కె.సుశీల తదితర ఉపాధ్యాయులు విద్యార్థినులను అభినందించారు.


ఎలమంచిలి బాలికోన్నత ప్లస్ పాఠశాల విద్యార్థినుల విన్యాసం

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి

శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్

పాయకరావుపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి మెరుగైన సమాజాన్ని నిర్మించాలని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అన్నారు. గురువారం స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో నిర్వహించిన గురుపూజోత్సవాలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థిగా ఉంటూ టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అప్‌డేట్ చేసుకోవాలన్నారు. తర్వాత ఉపాధ్యాయులకు ఆటలు, నృత్య, నాటక, బృందగాన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పలువురు గురువులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


శ్రీప్రకాష్‌లో గురుపూజోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


పెదబోదిగల్లం గురుపూజోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లిలో..

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పాఠశాలలకు సెలవు కావడంతో ఒక్కరోజు ముందుగానే గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెదబోదిగల్లం హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎస్. జయశ్రీ, ఉపాధ్యాయులు ఎన్‌వీఎస్ ఆచార్యులు, ఫాల్గుణరావు, కుమారి, పద్మావతి, రమేశ్‌బాబు, నాగేశ్వరరావు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. గొడిచెర్ల హైస్కూల్‌లో హెచ్‌ఎం సత్యకుమార్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం నిర్వహించారు.అనేక పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

మునగపాకలో..

విద్యార్థులకు విద్యాబుద్దులు అందించడంలో ఉపాధ్యాయులది గురుతర బాధ్యత అని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు జరిగాయి. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వాస్తవానికి తల్లిదండ్రులు కంటే ఎక్కువ బాధ్యత ఉపాధ్యాయులదే అని అన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ పి.సత్యనారాయణను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, ఎంఈవో బుద్ధ శివనాయుడు. ఏపీటీఎఫ్ నాయకులు పెంటకోట సత్యనారాయణ, ఎంవై.రాము పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

స్థానిక విశాఖ పబ్లిక్ స్కూల్‌లో గురు పూజోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ గండిబోయిన అప్పలరాజు, హెచ్ఎం సుధారాణితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

▸▸ జిల్లాపరిషత్ సీఈవో నారాయణమూర్తి

కోటవురట్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లాపరిషత్ సీఈవో నారాయణమూర్తి అన్నారు. గురువారం మండలంలోని తంగేడు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి తడి, పొడి చెత్త సేకరణ ఎలా జరుగుతుందో ఆరాతీశారు. చెత్త సేకరణలో శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నట్టు గుర్తించారు. అనంతరం సీఈవో మాట్లాడుతూ వీధుల్లో సేకరించిన తడి,పొడి చెత్తను సంపదగా తయారు చేయాలన్నారు. ఇందుకు సిబ్బంది, అధికారులు నిర్లక్ష్యం వహించకూడాదన్నారు. పంచాయతీ ఆదాయం పెంచుకోవాలన్నారు. అనంతరం రక్షిత నీటి పథకానికి క్లోరినేషన్ చేశారా? లేదా పరిశీలించారు.


తంగేడు సంపద కేంద్రాన్ని తనిఖీ చేసి సూచనలు చేస్తున్న సీఈవో

ఆయనతోపాటు ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, పంచాయతీ కార్యదర్శులు రఘురామ్, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

వెంకన్న క్షేత్రంలో ఆభరణాల తనిఖీ

▸▸ అన్నీ భద్రంగా ఉన్నట్టు గుర్తింపు

నక్కపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రంలో స్వామివారు, అమ్మవార్ల బంగారు ఆభరణాలు, వజ్ర వైఢూర్యాలన్నీ భద్రంగా వున్నట్టు టీటీడీ అధికారులు ధ్రువీకరించినట్టు ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఏటా టీటీడీ అధికారుల బృందం ఆలయంలో వున్న శ్రీవారి ఆభరణాలు, భక్తులు సమర్పించిన పలు ఆభరణాలను తనిఖీ చేస్తుంది. దీనిలో భాగంగా బుధ, గురువారాల్లో ఉపమాక ఆలయంలో శ్రీవారి ఆభరణాల పరిశీలన, తనిఖీ జరిగింది. అర్చక బృందం ఆధీనంలో వున్నటువంటి సదాసమర్పన వస్తువులను కూడా ఈ బృందం తనిఖీ చేసింది. ఇటీవల భక్తుల ద్వారా వచ్చిన కొన్ని బంగారు ఆభరణాలను పరిశీలించిన ఇన్వెంటరీ అధికారులు, వాటి వివరాలు రికార్డుల్లో నమోదు చేశారు. ఇకపై టీటీడీ నిబంధనల ప్రకారం భక్తులు సమర్పించే ఆభరణాలకు సంబంధించిజీఎస్‌టీతో కూడిన రశీదు, ధర్మకాటా రసీదులుండాలని ఇన్వెంటరీ అధికారులు సూచించారు. దాతలు సమర్పించాలనుకున్న వస్తువుల గురించి ముందుగా టీటీడీకి లేఖను సమర్పించాల్సి వుంటుందని సూచించారు. రెండురోజుల ఇన్వెంటరీ తనిఖీల్లో భాగంగా శ్రీవారి అన్ని వస్తువులు భద్రంగా వున్నట్టు ఈ బృందం గుర్తించింది. అదేవిధంగా విశాఖ ట్రెజరీలో భద్రపర్చిన ఉపమాక వెంకన్న వజ్ర,వైఢూర్యాలు, బంగారు ఆభరణాలను కూడా టీటీడీ చీఫ్ అక్కౌంట్ ఆఫీసర్ వెంకటరమణ, టీటీడీ విజిలెన్స్ అధికారుల బృందం రుషికొండలో వున్న టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో క్షుణ్ణంగా పరిశీలించినట్టు చెప్పారు. ఉపమాక ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావు సమక్షంలో రుషికొండ ఆలయంలో ఉపమాక వెంకన్న ట్రెజరీ ఆభరణాలను కూడా తనిఖీ చేసి,అన్నీ సక్రమంగా వున్నట్టు ధ్రువీకరించారు.


వెంకన్న ఆలయంలో ఆభరణాలను పరిశీలిస్తున్న టీటీడీ అధికారులు

రాంబిల్లిలో ఊపందుకున్న వరి నాట్లు

రాంబిల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ వరి నాట్లు ఊపందుకున్నాయి. జూన్‌లో వరి నాట్లు వేయాల్సి ఉండగా వర్షాభావం కారణంగా ఆగస్టు నెలలో ప్రారంభించారు. మండలంలో ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 5,653 ఎకరాలు కాగా ఇప్పటికే 2,500 ఎకరాల్లో వరినాట్లు పడ్డాయని, ఈనెలాఖరు నాటికి శతశాతం పూర్తవుతాయని ఏవో సి.సుమంత తెలిపారు. నాట్లు వేసే రైతులకు తమ సిబ్బంది ద్వారా సూచనలు అందిస్తున్నామన్నారు. ఇప్పటికే 199 టన్నుల ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా అందజేశామన్నారు. ఎరువులను అందుబాటులో ఉంచామన్నారు. సాగు చేస్తున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏవో సుమంత కోరారు.


రైతులకు సూచనలిస్తూ నాట్లు వేయిస్తున్న వ్యవసాయాధికారులు

వాడవాడలా అన్న సమారాధనలు

ఎలమంచిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి వీధిలో గురువారం అన్నసమారాధనాలు ఏర్పాటు చేశారు. భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. పట్టణంలోని కోర్టు జంక్షన్, దిమిలి రోడ్డు జంక్షన్, నెహ్రూనగర్, పోలిమేరమ్మ అమ్మవారి జంక్షన్‌ల వద్ద అన్న సమారాధనలను ఏర్పాటు చేశారు. కోర్టు జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ పిట్టా శ్రీను, గొలుసుపూడి బుజ్జి, గిన్ని ఆదిరెడ్డి, రమేష్, అంగా శంకర్ తదితరుల పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ కో-ఆప్షన్ మెంబరు దూది నరసింహమూర్తి, రాంబాబు, యువకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

పలు గ్రామాల్లో వినాయక పందిళ్ల వద్ద గురువారం అన్నసమారాధనల అనంతరం నిమజ్జనాలు జరిగాయి. పూడిమడక పాత బస్టాండ్ వద్ద సిద్ధి వినాయక మండపం, కడపాలెం లింగాల దిబ్బ వద్ద బాల గణపతి యూత్, భోగాపురంలో వరసిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం అన్న సమారాధనలు నిర్వహించారు. సాయంత్రం పూజానంతరం ఊరేగింపులు జరిపారు. చిటికెల భజనలు, కోలాటాలతో నిమజ్జనాలు జరిపారు. పూడిమడకలో గురువారం రాత్రి నాలుగు వినాయక నిమజ్జనాలు జరిగాయి.

ఎస్.రాయవరంలో..

మండలంలోని పలు గ్రామాల్లో గల వినాయకుని మండపాల వద్ద గురువారం ఆయా కమిటీల ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. పెనుగొల్లు, గుడివాడ, అడ్డరోడ్డు, రేవుపోలవరం తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చూడాలి

▸▸ మండల ప్రత్యేకాధికారి జయప్రకాష్ లోక్‌నాయక్


అధికారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి జయప్రకాష్ లోక్‌నాయక్

పాయకరావుపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతు లకు అవసరమైన యూరియా కొరత లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి జయప్రకాష్ లోక్‌నాయక్ వ్యవసాయాధి కారులను ఆదేశిం చారు. గురువారం పట్టణంలోని వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ రైతులకు యూరియా, ఇతర ఎరువులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని, రైతులు అడిగిన వెంటనే అందజేయాలన్నారు. మండలస్థాయి అధికారులు రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌లు, ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దారు ఎస్ఏ.మహేశ్వరరావు, ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు, ఏవో పి.ఆదినారాయణ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ. 60 వేలు ఆర్థిక సాయం

నక్కపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి శెట్టిబలిజ కాలనీలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో విద్యుదాఘాతంతో మృతి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ విజయ్‌కుమార్‌కు గురువారం సిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ప్రతినిధులు రూ.60 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ నేతృత్వంలో కాగిత గ్రామంలోని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఉత్సవ కమిటీ తరపున రూ 60వేలు ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సంఘటన పట్ల విచారం వెలిబుచ్చారు.

ఆటో బోల్తా పడి విద్యార్థి మృతి

... 3వ పేజీ తరువాయి

ఎక్కారు. కొంతదూరం వెళ్లిన తరువాత కృష్ణాపురం వద్ద ఆటోకు అడ్డుగా పంది వచ్చింది. దీంతో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ క్రమంలో ఆకాశ్‌పై ఆటో పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి ఆటోను పక్కకు తీసి, ఆకాశ్‌ను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. ఆటోలో ప్రయాణిస్తున్న అనీషా, మరో ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ ఎం.శ్రావణి, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ పరిశీలించారు. కాగా ఆకాశ్ నేత్రాలను విశాఖ ఐ బ్యాంకుకు ఇచ్చేందుకు తల్లిదండ్రులు అంగీకరించడంతో వైద్య సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రక్త దానంలో రికార్డు

... 3వ పేజీ తరువాయి

అయ్యన్నపాత్రుడు రక్తదాన శిబిరాలు ప్రారంభించారు. రక్త దాతలను ఆయనతోపాటు 25వవార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ అభినందించారు.

బ్లడ్ ప్రాసెసింగ్ చార్జీలు తగ్గించడానికి కృషి : అయ్యన్న

రక్తదాన శిబిరాల్లో దాత నుంచి సేకరించిన తర్వాత బ్లడ్‌ను ప్రాసెస్ చేయడానికి ఖర్చు అధికమవ్వడం వల్ల ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల్లో అధిక ధరకు రక్తం యూనిట్లను విక్రయిస్తున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ఈ ఖర్చుని తగ్గించడానికి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి, తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు. బ్లడ్ ప్రాసెసింగ్ ఖర్చు తగ్గితే ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల్లో అందుబాటు ధరలకు రక్తం లభిస్తుందని తెలిపారు.

జిల్లాలో 39 మంది ఉత్తమ గురువులు

... 3వ పేజీ తరువాయి

జీహెచ్ఎస్, తానాం, పరవాడ మండలం; డి.కాళిదాస్, జడ్పీహెచ్ఎస్, కశింకోట.

ఎస్‌జీటీ విభాగంలో..

జీవీ రామన్న, ఎంపీపీఎస్, భీమవరం ఎస్.రాయవరం మండలం; చిలికళ్ల దేవి, ఎంపీయూపీఎస్, చెట్టుపాలెం, మాకవరపాలెం మండలం; డీఆర్‌కే శాస్త్రి ఎంపీపీఎస్, దేవవరం, నక్కపల్లి మండలం; కె.సతీశ్, ఎంపీపీఎస్, డీఎల్ పురం-1, నక్కపల్లి మండలం; వి.శ్రీనివాసరావు, ఎంపీపీఎస్, గొల్లలపాలెం, కె.కోటపాడు మండలం; బీవీహెచ్ చంద్రశేఖర్, ఎంపీపీఎస్, వెలంకాయలపాలెం, రోలుగుంట మండలం; బొడ్డు అప్పలనాయుడు, ఎంపీపీఎస్, చౌడువాడ, కె.కోటపాడు మండలం; కె.బంగారయ్య, ఎంపీపీఎస్, పిండ్రంగి, కె.కోటపాడు మండలం; ఎస్.రామ, ఎంపీపీఎస్, ఎస్‌సీడీఎం, వడ్డాది, బుచ్చెయ్యపేట మండలం; ఇందాన అనిత, ఎంపీపీఎస్, బొడ్డువలస, సబ్బవరం మండలం; కె.దానిమ్మనాయుడు, ఎంపీపీఎస్, పాత వాలాబు, దేవరాపల్లి మండలం; కె.రాజేశ్, చినదొడ్డిగల్లు-2, నక్కపల్లి మండలం; కేఎన్ సుభాస్‌చంద్ర, ఎంపీయూపీఎస్, తామర్బ, దేవరాపల్లి మండలం.

ప్రధానోపాధ్యాయుల విభాగంలో..

ఎన్.శ్రీనివాసరావు, జడ్పీహెచ్ఎస్, వాడచీపురుపల్లి, పరవాడ మండలం; డి.వరహామూర్తి, జడ్పీహెచ్ఎస్, వరహాపురం, చీడికాడ మండలం; డీఎస్ భవాని, జడ్పీ జీహెచ్ఎస్, పాయకరావుపేట; కేవీ మాధవి, జడ్పీ జీహెచ్ఎస్, నర్సీపట్నం; ఆర్‌వీ జగదీశ్, జడ్పీ హెచ్ఎస్, నానిగిరపాడు, సబ్బవరం మండలం; పి.మల్లికార్జునరావు, జడ్పీహెచ్ఎస్, పీఎస్‌పేట, చోడవరం మండలం.

ఎరువుల కొరత లేదు

... 3వ పేజీ తరువాయి

వారంలో 60 టన్నులు, మూడో వారంలో 60 టన్నులు ఇస్తామన్నారు. ప్రైవేటు డీలర్లు ఎక్కువ ధరకు ఎరువులు అమ్మితే లైసెన్సు రద్దు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రైతులు యూరియా, పొటాష్, డీఏపీ ఎరువులను నిర్ణీత మోతాదులో పంటలకు వేయాలని, కానీ పొటాష్, డీఏపీ రేటు ఎక్కువ వుండడంతో కొంతమంది రైతులు యూరియాను మోతాదుకు మించి వాడుతున్నట్టు తమ సిబ్బంది దృష్టికి వచ్చిందన్నారు. దీనివల్ల ఇతర రైతులకు సకాలంలో యూరియా అందదని, మరోవైపు అధిక యూరియా వాడకం వల్ల పంటలను తెగుళ్లు త్వరగా ఆశించే ప్రభావం వుందన్నారు. వీరి వెంట తహశీల్దారు లక్ష్మీదేవి, వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ, విస్తరణ అధికారి కిరణ్‌కుమార్, ఎస్ఐ పి.సత్యనారాయణ వున్నారు.

ఉత్తమ అధ్యాపకునిగా చిన్నారావు ఎంపిక

... 3వ పేజీ తరువాయి

ఇంటర్మీడియట్ బోర్డు సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. 2008లో జిల్లాస్థాయి ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. అదే ఏడాది పదోన్నతిపై నర్సీపట్నం జూనియర్ కళాశాల లెక్చరర్‌గా చేరారు. తరువాత వేములపూడి కళాశాలలో కూడా కొంతకాలం పనిచేశారు. మూడేళ్ల నుంచి నర్సీపట్నం కళాశాల ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. పదోన్నతిపై ఇటీవల వడ్డాది జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. నర్సీపట్నంలో విధులు నిర్వహించినప్పుడు లయన్స్ క్లబ్ సహకారంతో రూ.20 లక్షలతో గ్రంథాలయం ఏర్పాటు చేశారు.

పందుల యజమానుల అరెస్టుకు డిమాండ్

▸▸ కృష్ణాపురం కాలనీ ప్రధాన రోడ్డుపై మృతదేహంతో పలు గ్రామాల ప్రజలు ధర్నా

▸▸ మూడు గంటలు ట్రాఫిక్‌కు అంతరాయం ▸▸ సీఐ చెప్పినా ఫలితం శూన్యం

▸▸ ఇన్‌చార్జి తహశీల్దార్ స్పష్టమైన హామీ ఇవ్వడంతో విరమణ



కృష్ణాపురం ప్రధాన రోడ్డుపై ధర్నా చేస్తున్న గ్రామాల ప్రజలు



కొత్తూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదాలకు కారణమవుతున్న పందుల యజమానులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి మండలం రామాపురం, కృష్ణాపురం, కొత్తూరు తదితర గ్రామాల ప్రజలు గురువారం మృతదేహంతో కృష్ణాపురం ప్రధాన రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. పందిని తప్పించబోయి ఆటో బోల్తా పడిన ప్రమాదంలో విద్యార్థి ఆంటోని ఆకాశ్ (14)మృతి చెందిన సంఘటన కొత్తూరు పంచాయతీ కృష్ణాపురం కాలనీ ప్రధాన రోడ్డుపై చోటుచేసుకున్న నేపథ్యంలో వారంతా ఆగ్రహం వ్యక్తం చేశారు. నిత్యం పందుల వల్ల ప్రమాదాల బారిన పడుతున్నామని వాపోయారు. ప్రమాదాలకు కారణమవుతున్న పందుల పెంపకం దారులను తక్షణమే అరెస్టు చేసి, పందులను నివారించాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని, జిల్లా కలెక్టర్, ఆర్డీవో సంఘటనా స్థలానికి రావాలంటూ నినాదాలు చేశారు. దీంతో సుమారు మూడు గంటల పాటు గ్రామీణ ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ, ఎస్ఐలు శేఖర్, వెంకటేశ్వరరావు, సంతోష్ సంఘటనా స్థలానికి చేరుకొని పందుల పెంపకం దారులపై చర్యలు తీసుకుంటామని చెప్పినా వారు వినిపించుకోలేదు. దీంతో ఇన్‌చార్జి తహశీల్దార్ శాంతిభూషణరావు అక్కడికి చేరుకొని పందుల పెంపకందారులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వారం రోజుల్లో వారితో మాట్లాడి పందుల నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించుకున్నారు.



పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి చిత్రపటం వద్ద ప్రిన్సిపాల్, సిబ్బంది నివాళి



మామిడిపాలెంలో సన్మానం పొందిన ఉపాధ్యాయులతో విద్యార్థులు, తోటి సిబ్బంది



సబ్బవరం మండలం ఆరిపాక జడ్పీ హైస్కూల్‌లో....

గురువు ద్వారానే గమ్యం

▸▸ విద్యార్థులు మార్గదర్శకులుగా చూడాలి ▸▸ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనుమడు డాక్టర్ సుబ్రహ్మణ్య శర్మ

▸▸ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

తుమ్మపాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులను జీవిత మార్గదర్శకులుగా చూడాలని భారత మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనుమడు డాక్టర్ సుబ్రహ్మణ్య శర్మ అన్నారు. అనకాపల్లిలోని డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశంలో ప్రతి విద్యార్థిని ప్రభావితం చేశారన్నారు. గురువు ద్వారానే గమ్యం అన్న భావనను ప్రతి ఒక్కరిలో కల్పించారని వివరించారు. ఉపాధ్యాయులకు మాత్రమే సమాజాన్ని మలచగల శక్తి ఉంటుందన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. డైట్ కళాశాల సాధించిన విజయాలను ప్రశంసించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి అందరూ కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ సుబ్రహ్మణ్యశర్మను ఘనంగా సత్కరించారు. కళాశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు



డైట్ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుబ్రహ్మణ్యశర్మ, చిత్రంలో వీరభద్రరావు, రత్నాకర్

వెండి పతకాలు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, అధ్యాపక సిబ్బంది డాక్టర్ కె.సుజాత తదితరులు పాల్గొన్నారు. అలాగే, తుమ్మపాల, మామిడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మామిడిపాలెంలో పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయుల పాత్రను పోషించి దిగువ తరగతి విద్యార్థులకు చక్కగా పాఠాలను బోధించి సందడి చేశారు. అనంతరం ఉపాధ్యాయులను దుశ్శాలువాలు కప్పి సత్కరించారు. తుమ్మపాలలో స్కూల్ కమిటీ చైర్మన్ పెతకంశెట్టి బలరాం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.

పరవాడలో...

పరవాడ : సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలి వినోద్‌బాబు అన్నారు. కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధా కృష్ణన్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులను సన్మార్గంలో నడిపించడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తారన్నారు. అనంతరం ఆయనను విద్యార్థులు సత్కరించారు.

సబ్బవరంలో...

సబ్బవరం : ఆరిపాక హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంఈవో రవీంద్రబాబు, సర్పంచ్ పాలి శెట్టి పార్వతి, గ్రామ పెద్దలు పాలిశెట్టి సురేశ్ రాజ్, మాజీ ఎంపీటీసీ మల్ల కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ శరగడం శ్రీను సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, రిటైర్డ్ టీచర్ అరసాడ సూర్య నారాయణ, బుద్ధ నరసింహమూర్తి, నిమ్మల సత్యనారాయణ, ఊడి కృష్ణమూర్తిలతో పాటు పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. గ్రామ పెద్దలు ఎన్‌పీ రాజు, కరక శంకరరావు, బొడ్డేటి మహలక్ష్మీనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో వినాయక పూజలు



వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా, తదితరులు

అనకాపల్లి రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహం వద్ద ఎస్పీ తుహిన్‌సిన్హా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కార్యాలయ ప్రాంగణంలో జరిగిన అన్నసమారాధనలో సిబ్బందితో కలిసి ప్రసాదాలను వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావులు తదితరులు పాల్గొన్నారు.

'అన్ని మతాల వేడుకలకు ప్రభుత్వం ప్రాధాన్యం'



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా, తదితరులు

తుమ్మపాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనలో అన్ని మతాల వారి పండగలకు ప్రాధాన్యం కల్పించడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. ఇక్కడి టీడీపీ కార్యాలయంలో గురువారం ఆంధ్రప్రదేశ్ గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వినాయక మండపాలకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించడం ఆనందదాయకమన్నారు. అనంతరం ఉత్సవ కమిటీకి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, నాయకులు పచ్చికూర రాము, గొంతిన శ్రీనివాసరావు, కేకేవీఏ నారాయణరావు, ఉగ్గిన రమణమూర్తి, బాబర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ఆటో కార్మికులు ఆందోళన



నిరసన తెలియజేస్తున్న ఆటో డ్రైవర్లు

తుమ్మపాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకుడు కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఆటో వర్కర్స్ యూనియన్ సభ్యులతో కలిసి గురువారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్ ప్రయాణాన్ని కల్పించడంతో ఆటో కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దీంతో వారి కుటుంబాలురోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సూరిశెట్టి బాబునాయుడు, కోరిబిల్లి రామఅప్పారావు, గండిబోయిన దివాకర్, పెంటకోట రాము తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పేరిట మోసం చేసి వ్యక్తిపై కేసు

కొత్తూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు ఇస్తానని రైతును మోసం చేసిన దుకాణ యజమానిపై కేసు నమోదు చేసినట్టు అనకాపల్లి పట్టణ ఎస్ఐ సంతోష్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. మండలంలోని కుంచంగి గ్రామానికి చెందిన పల్లెల అప్పారావు అనే రైతు అనకాపల్లిలో ఉన్న శారదా సీడ్స్‌లో ఎరువుల కొనుగోలు నిమిత్తం రూ.2,700 షాపు యజమాని గెడ్డం వెంకటేష్‌కు ఇచ్చాడు. అయితే ఎరువుల కోసం ఎన్నిమార్లు అడిగినా స్పందన లేకపోవడంతో మండల వ్యవసాయాధికారి రంగాచారి దృష్టికి ఈ విషయాన్ని తీసుకు వెళ్లాడు. ఈ మేరకు గురువారం ఆ షాపునకు వెళ్లి తనిఖీ చేయగా ఎరువులు, ఈ-పోస్ యంత్రం వంటి లేకపోవడంతో ఏవో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

యూరియాపై వైసీపీ దుష్ప్రచారం

▸▸ రైతులెవరూ నమ్మవద్దు ▸▸ అవసరమైనంత సరఫరా

▸▸ గ్రామాల్లో ఎంత మేర స్టాక్ ఉందో కూటమి నాయకులు వెల్లడి

కొత్తూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అవసరమైనంత మేరకు ఎరువులను ప్రభుత్వం సరఫరా చేస్తుంటే వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేయడం తగదని కూటమి నాయకులు అన్నారు. గురువారం అనకాపల్లి పట్టణంలోని జనసేన కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి బాబీ, జనసేన నాయకుడు చదరం నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకుల దుష్ప్రచారాన్ని రైతులెవ్వరూ నమ్మవద్దన్నారు. అనకాపల్లి మండలం అక్కిరెడ్డిపాలెంలో 12 టన్నులు, బవులవాడలో ఆరు టన్నులు, చింతనిప్పుల అగ్రహారంలో 12 టన్నులు, అనకాపల్లిలో ప్రభుత్వం అనుమతించిన ఎరువుల దుకాణాల్లో 292 టన్నులు, కుంచంగిలో ఆరు టన్నులు, కూండ్రంలో ఆరు టన్నులు, మామిడిపాలెంలో ఆరు టన్నులు, పాపయ్యపాలెంలో 12 టన్నులు, పిసినికాడలో 12 టన్నులు, రేబాకలో 12 టన్నులు, శంకరంలో 12 టన్నులు, తుమ్మపాల అన్నపూర్ణ పీఏసీఎస్‌లో 72



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు

టన్నులు, తగరంపూడిలో 18 టన్నులు, వెంకుపాలెంలో 12 టన్నులు, ఊడేరు, దిబ్బపాలెంలలో ఆరు టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు రైతులకు 592 టన్నులు సరఫరా చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు గంగుపాం జగదీశ్ బంటు రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా భూలోకమాంబ పండగ

పరవాడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడలో భూలోకమాంబ పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి విశేష పూజల అనంతరం దర్శనాలు ప్రారంభమయ్యాయి. వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సర్పంచ్ శిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, కూటమి నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైలా రామచంద్రరావు, పైలా కృష్ణ, పైలా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



ఆశ కార్యకర్తల పోస్టులు ఆయా కుటుంబ సభ్యులతో భర్తీ చేయాలి

▸▸ సర్వీసులో ఉండగా ఎటువంటి ప్రయోజనం పొందలేదు

▸▸ డీఎంహెచ్‌వోకు యూనియన్ జిల్లా ప్రతినిధుల వినతి



డీఎంహెచ్‌వో హైమావతికి వినతి పత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

కొత్తూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రిటైర్ అయిన, మృతి చెందిన ఆశ కార్యకర్తల స్థానాల భర్తీకి వైద్య ఆరోగ్య శాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఆ ఖాళీలను ఆశ కార్యకర్తల కుటుంబాలతో భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ హైమావతికి యూనియన్ ప్రతినిధులు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సత్యవతి, అధ్యక్షురాలు కె.శాంతి మాట్లాడుతూ ఇరవై సంవత్సరాల పాటు సేవలందించి రిటైర్ అయిన ఆశ కార్యకర్తలు ప్రభుత్వం నుంచి ఎటువంటి పరిహారం పొందలేదన్నారు. ఈ పరిస్థితుల్లో రిటైర్ అయిన, మృతిచెందిన వారి ఆశ కార్యకర్తల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఈ సమస్యపై ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాల్సిందిగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఇ.పార్వతి, కార్యదర్శులు కె.వరలక్ష్మి, ఎం.సూర్యకళ తదితరులు పాల్గొన్నారు.

ఎ.సిరసపల్లిలో ల్యాండ్ పూలింగ్ వద్దు

▸▸ తప్పని సరైతే లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వాలి ▸▸ ఆర్డీవోకు గ్రామ పెద్దల వినతి

సబ్బవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శివారు గ్రామం అడ్డూరు సిరసపల్లిలో ల్యాండ్ పూలింగ్ వద్దని, తాము భూములు ఇచ్చేది లేదని బంగారమ్మపాలెం, ఎ.సిరసపల్లి గ్రామాల రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయేషా, తహశీల్దార్ బి.చిన్నికృష్ణలను గురువారం కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు దొడ్డి సూర్యప్రకాశరావు, అంగటి సూరిబాబు, గొర్లి రామునాయుడు తదితరులు మాట్లాడారు. ఎ.సిరసపల్లిలో ల్యాండ్ పూలింగ్ కింద 371.75 ఎకరాల భూమిని సమీకరిస్తున్నట్టు ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. ఆ మేరకు రెవెన్యూ అధికారులు గ్రామ సభ నిర్వహించి, సర్వే కూడా చేస్తున్నారన్నారు. అయితే భూములు ఇచ్చేందుకు ఎవరూ సుముఖంగా లేరన్నారు. ఎ.సిరసపల్లిలో ఉన్నదంతా ప్రభుత్వ భూమే నని, వాటిని ప్రభుత్వం తీసుకుంటే సాగుచేస్తున్న రైతులు ఊరి విడిచి వెళ్లిపోవడం తప్ప గత్యంతరం లేదని వాపోయారు. తరతరాలుగా ఆవే భూములను సాగు చేసుకుంటూ జీడి, జీడిమామిడి, సరుగుడు, జామ, కొబ్బరి ఇతర ఉద్యాన పంటలు సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నామన్నారు. భూములు తీసుకోవడం తప్పనసరైతే మెరుగైన పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దీనిపై లిఖిత పూర్వకంగా హామీ ఇస్తే రైతులమంతా కూర్చొని గ్రామ సభ పెట్టుకొని తీర్మానం చేస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం తమ పరిస్థితిని అర్థం చేసుకోవాలని విన్నవించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు రైతులు పాల్గొన్నారు.



ఆర్డీవో ఆయేషాకు వినతి పత్రం అందిస్తున్న గ్రామ పెద్దలు

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం



సీఎం సహాయ నిధి మంజూరు పత్రం అందిస్తున్న పంచకర్ల

సబ్బవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజారోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన పలువురికి వైద్య సహాయం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను గురువారం అందజేసి మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన పద్నాలు నెలల్లో కోట్లాది రూపాయలను అనారోగ్యం పాలైన వారికి చికిత్సల నిమిత్తం అందజేసినట్టు చెప్పారు. నాయకులు ఇందలి రమణ, కర్రి కనకరాజు, సింగం పల్లి శ్రీను, మేడిశెట్టి రాము, ఉగ్గిన రాము, అంగటి నానాజీ, తమరాన సత్యనారాయణ, పల్ల రమణ, కొండాజీ, పల్లి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : అనకాపల్లి మండలం గొలగాం పంచాయతీలో అనారోగ్యానికి గురైన వారికి సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను జనసేన నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన సాగుతున్నట్టు చెప్పారు. పార్టీ నాయకులు చదరం నాగేశ్వరరావు, కొసిరెడ్డి త్రినాథ్, గొర్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలతో మహిళా వికాసం'

కొత్తూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని తద్వారా ఆర్థిక ప్రగతి సాధించాలని మహిళా శిశు సంక్షేమ అభివృద్ధి నోడల్ అధికారిణి మేరీ సువార్త అన్నారు. గురువారం ఇక్కడి రెవెన్యూ కాలనీలో స్పందన స్ఫూర్తి రూరల్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలకు జ్యూట్ ప్యాక్ శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం మహిళల అభివృద్ధికి ఎన్నో పథకాలు అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఎస్ఐ రాములమ్మ మాట్లాడుతూ స్త్రీల బలాన్ని, బాధ్యతలను వివరించారు. బాలల సంరక్షణ అధికారి రమేష్ బాల్య వివాహాల వల్ల అనర్థాలు, చట్టాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగమణి, సొసైటీ అధ్యక్షురాలు విశాలాక్షి, కార్యదర్శి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

13 గిరిజన గ్రామాలకు కనెక్టివిటీ రహదారులు

» ఎ.శనివారం గ్రామానికి రోడ్డు నిర్మించిన ఘనత కూటమిదే

» టీడీపీ పాడేరు నియోజక వర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంజలి శనివారం గ్రామ ప్రజల దశాబ్దాలనాటి రహదారి కలను కూటమి ప్రభుత్వం నెరవేర్చినట్టు టీడీపీ పాడేరు నియోజక వర్గం ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. గురువారం ఆ గ్రామ పంచాయతీలో ఆమె పర్యటించారు. స్థానిక గిరిజనులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. తొలుత స్థానిక మినీ గురుకులం పాఠశాలను సందర్శించిన ఆమె విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ అంజలి శనివారం పంచాయతీకి కనీస రహదారిలేక ఆదివాసీలు అవస్థలు పడేవారన్నారు. రోగులు, గర్భిణులను డోలీపై ఆస్పత్రికి తరలించాల్సిన దుస్థితిని ఎదుర్కొనేవారన్నారు. ఈ స్థితిలో 2018లో ఉపాధి హామీ పథకం నిధులు నాటి టీడీపీ ప్రభుత్వం మంజూరుచేసిందన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈటెండర్లను రద్దు చేసిందన్నారు. నాటి ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ప్రస్తుతం ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరావు ఈ గ్రామానికి రోడ్డు నిర్మిస్తామని ప్రకటించడం తప్పా ఆ హామీలు ఆచరణకు నోచుకోలేదన్నారు. 2024లో అధికారంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి సమస్య తీసుకువెళ్లానన్నారు. రెండు నెలల క్రితం ప్రభుత్వం రూ.2.6కోట్ల ఉపాధి కేటాయించడంతో తారు రోడ్డు నిర్మాణం పూర్తయిందని చెప్పారు. దీంతో ప్రాంత ప్రజలు సుదీర్ఘకాలం ఎదుర్కొంటున్న రవాణా కష్టాలు తీరాయన్నారు. ఈరహదారి తన కృషి ఫలితంగా కూటమి ప్రభుత్వం నిర్మించిందే తప్పా వైసీపీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆందోళన చేస్తే వచ్చిందికాదన్నారు.ఈ పంచాయతీ పరిధిలో 13గ్రామాలకు కూటమి ప్రభుత్వం కనెక్టివిటీ గ్రావెల్ రోడ్లు నిర్మిస్తుందన్నారు. అర్హులందరికి పక్కా గృహాలు మంజూరు చేసిందన్నారు. తాగు నీటి పథకాలు నిర్మాణం చేపడుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలన్ని నెరవేర్చుతుందన్నారు.ఆదివాసీలు టీడీపీ, చంద్రబాబుకి అండగా నిలబడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి గోవిందరావు, పార్టీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ అబ్బాయినాయుడు, నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, గోవిందరావు, ఆండ్రాబు లక్ష్మణ్, గ్రామపెద్దలు కిముడు నారాయణరావు, పరమేశ్వరరావు, కుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గిడ్డి ఈశ్వరి

సభాపతి దృష్టికి సమస్యలు



అయ్యన్నపాత్రుడుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నేతలు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత సమస్యలను సభాపతి చింతకాలయ అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకువెళ్లినట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్ తెలిపారు. గురువారం స్పీకర్ జన్మదినం పుర్కరించుకుని మర్యాదపూర్వకంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, చింతపల్లి, జీకేవీధి టీడీపీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రహదారులు, తాగు నీటి సమస్యలను సభాపతికి వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు బేరా సత్యనారాయణ పడాల్, జీకేవీధి పీఏసీఎస్ చైర్‌పర్సన్ మొట్టడం నూకరాజు, జిల్లా అధికార ప్రతినిధి రామకృష్ణ పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక న్యూట్రిషన్ కిట్లు

» మహిళా శిశు సంక్షేమశాఖ ఆర్‌జేడీ చిన్మయిదేవి



అంగన్‌వాడీ కేంద్రంలో బాలికల ఎత్తును పరిశీలిస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి

చింతపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత గర్భిణులు, బాలింతలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రత్యేక న్యూట్రిషన్ కిట్లు అందజేస్తున్నదని మహిళా శిశు సంక్షేమశాఖ విశాఖపట్నం రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) జి.చిన్నయిదేవి అన్నారు. గురువారం ఆమె స్థానిక ముత్యాలమ్మ వీధి అంగన్‌వాడీ కేంద్రం, బాలసదనం వసతి గృహం, ప్రాజెక్టు కార్యాలయాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారుల ఆరోగ్య పర్యవేక్షణను స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో ఆదివాసీ గర్భిణులు, బాలింతలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారన్నారు. సీలేరులో కాలం చెల్లిన బాలామృతం పంపిణీ చేశారని పత్రికల్లో వచ్చిన వార్తలపై విచారణ చేపడుతున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీడీపీవో సీహెచ్ శ్రీదేవి, నర్సీపట్నం సీడీపీవో జీవీ రమణ, బాలసదనం సూపరింటెండెంట్ భారతి, సీనియర్ అసిస్టెంట్ శర్మ పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవోలు ప్రసాద్, సహోపాధ్యాయులు

చింతపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఎంఈవో పీబీవీవీ ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఉత్తమ సేవలందిస్తున్న 32మంది ఉ పాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 గెమ్మెలి బోడం నాయుడు, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీగిరి, గిరిజన ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు బౌడు గంగరాజు, ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుముల వెంకట రమణ, ఉపాధ్యాయులు కోటేశ్వరారవు, అర్చకుడు సాయి పాల్గొన్నారు.

డ్యాన్స్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న ప్రతినిధులు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వినాయక చవితి ఉత్సవాలు పురష్కరించుకొని అల్లూరి యూత్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నిర్వహించిన డ్యాన్స్ పోటీలకు విశేష స్పందన లభించింది. విశాఖ, పాడేరు, పెదబయలు, చింతపల్లి తదితర ప్రాంతాలతో పాటు ఒడిశా నుంచి పలువురు పాల్గొన్నారు. జూనియర్స్ సింగిల్స్ విభాగంలో శరణ్య ప్రథమ బహుమతి, ద్వితీయ బహుమతి పాంగి స్మైలి, తృతీయ బహుమతి నిత్య కైవసం చేసుకున్నారు. జూనియర్స్ గ్రూప్‌లో ఎం.హాసిని గ్రూప్ ప్రథమ, బటర్‌ఫ్లై గ్రూప్ ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారు. సీనియర్స్ సింగిల్స్‌లో పాడేరుకు చెందిన శివాజీ పుష్ప గెటప్‌లో డ్యాన్స్ చేసి ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. మౌళి ద్వితీయ, జై తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. సీనియర్స్ గ్రూప్స్‌లో పాడేరుకు చెందిన డేవిడ్ గ్రూప్ ప్రథమ, ఎస్‌కే గల్లీ బాయ్స్ జోలాపుట్టు ద్వితీయ. రహమాన్ చంటికి ప్రత్యేక బహుమతిని అందజేశారు. విజేతలకు వైసీపీ మండల అధ్యక్షుడు పి.పద్మారావు, అల్లూరి యూత్ బహుమతులు అందజేశారు.

కాలం చెల్లిన బాలామృతం పంపిణీపై విచారణ

»'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



అన్నవరం అంగన్‌వాడీ మినీ సెంటర్‌లో విచారణ చేస్తున్న సీడీపీఓ మాలతి

సీలేరు, సెప్టెంబరు 4 , (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన బాలామృతం ప్యాకెట్లను వెనక్కి తీసుకోవాలని ఐసీడీఎస్ మండల సీడీపీఓ మాలతి ఆదేశించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో కాలం చెల్లిన బాలామృతం పంపిణీ' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించి ఆమె జీకేవీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ అన్నవరం మినీ అంగన్‌వాడీ సెంటర్‌లో అన్నవరం మినీ అంగన్‌వాడీ సెంటర్‌కు చేరుకుని తనిఖీ చేసారు. సెంటర్‌లోని లబ్ధిదార్లతో సమావేశమై విచారణ చేపట్టారు. నిల్వ ప్యాకెట్లు పంపిణీపై కార్యకర్తపై ఆమె ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇంకాఎవరి వద్దయినా కాలం చెల్లిన బాలామృతం ఉంటే వెంటనే వెనక్కి తీసుకోవాలని కార్యకర్తలను ఆదేశించారు. కొత్త ప్యాకెట్లను లబ్ధిదార్లకు పంపిణీ చేయించారు. మరోసారి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా స్టాకు వచ్చిన వెంటనే లబ్ధిదార్లకు సరఫరా చేయాలని ఆమె ఆదేశించారు.

పీఏసీఎస్‌కు నూతన కమిటీ నియామకం



చైర్ పర్సన్‌గా నియమితులైన సాంబశివరావు

కొయ్యూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొయ్యూ రు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్‌పర్సన్‌గా నడింపాలెం పంచాయతీ మాజీ సర్పంచ్ సుమర్ల సాంబశివరావును నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయనతో పాటు డైరె క్టర్లుగా బీజేపీకు చెందిన గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రీముల చంద్రరావును, ఆడాకులకు చెందిన టీడీపీ సీనియర్ నేత కూనిశెట్టి జోగారావులను నియమించారు. ఈ మేరకు ఈ కమిటీ త్వరలో బాధ్యతలు స్వీకరించనుంది.

జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలుగా సూరిబాబు, భవాని ఎంపిక





సెక్రటరీలుగా ఎంపికైన సూరిబాబు (పాడేరు), భవాని (రంపచోడవరం)

పాడేరురూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీలు (డీఎస్‌జీఎస్)గా పాంగి సూరిబాబు, భవాని ఎంపికయ్యారు. బుధవారం అమరావతిలో కమిషనర్ స్వయంగా ఇంటర్వ్యూ చేసి వీరిని ఎంపిక చేశారు. అల్లూరి జిల్లా (పురుషుల విభాగం)కు పాంగి సూరిబాబు (ఎస్‌ఏపీఈ) పాడేరు, (మహిళా విభాగం)కు భవాని (ఎస్‌ఏపీఈ) రంపచోడవరంనకు కేటాయించారు. నూతనంగా ఎంపికైన వీరు డీఎస్‌జీఎస్‌లుగా రెండేళ్ల పాటు విధులను నిర్వహించాల్సి ఉంటుంది. ప్రతీ జిల్లాకు ఇద్దరు డీఎస్‌జీఎస్‌లను నియమించడం ఇదే ప్రథమం కావడం విశేషం. తానుడీఎస్‌జీఎస్‌లు ఎంపిక కావడం ఆనందంగా ఉందని సూరిబాబు అన్నారు. ప్రభుత్వం ఆదేశించిన విధంగా క్రీడా రంగం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛన్ అందజేత



కేజీహెచ్‌లో లబ్ధిదారుని కుటుంబ సభ్యులకు పింఛన్ సొమ్ము అందిస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

కొయ్యూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య బారిన పడి చికిత్స పొందుతున్న వ్యక్తికి ఆస్పత్రికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ అందించి ఆదుకున్నారు. మండలంలో రాజేంద్రపాలెం పంచాయతీ సోలాబు గ్రామానికి చెందిన కోనే సన్యాసిరావు అనారోగ్యంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందు తున్నారు. గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్ దాను 130 కిలోమీటర్ల దూరంలో వైద్య సేవలు పొందుతున్న సన్యాసిరావు వద్దకు వెళ్లిఆగస్టు నెల పింఛను అందచేశారు. దీంతో వెటర్నరీ అసిస్టెంట్‌కు అతని కుటుంబీకులు ధన్యవాదాలు తెలిపారు.

సీఐను కలిసిన బీజేపీ నేతలు

కొయ్యూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు సీఐగా నూతన బాధ్యతలు స్వీ కరించిన బి. శ్రీనివాసరావును బీజేపీ మండల నేతలు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో తనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివకుమార్, పద్మరాజు, నేతలు చక్రరావు, లోకుల కిరణ్, గాలి దేముడు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పీటీజీ గ్రామాలకు రోడ్లు మంజూరు



పరమసిగవరం గ్రామ రో డ్డు నిర్మాణానికి సర్వే నిర్వహిస్తున్న జేఈ

సీలేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీకే వీధి మండలంలోని మారుమూల పీటీజీ గ్రామాలకు రహదారులు మంజూరైనట్టు పంచాయతీరాజ్ జేఈ జ్యోతిబాబు తెలిపారు. పీఎం జన్‌మన్ పథకంలో ధారకొండ నుంచి నిమ్మచెట్టు వరకు 2.4 కిలో మీటర్ల మేర రోడ్డుకురూ. 2.3 కోట్లు, నేలజర్త నుంచి కొండజర్త వరకు నాలుగు కిలోమీటర్ల రూ. 4.80 కోట్లు, గుమ్మిరేవుల పంచాయతీ పోతవరం నుంచి పరమసింగవరం వరకు ఐదు కిలోమీటర్ల రహదారి రూ. 5 కోట్లు, దుప్పులవాడ పంచాయతీ జీ నేరేడుపల్లి నుంచి కాట్రగెడ్డ వరకు నాలుగు కిలోమీటర్ల రహదారికి రూ. 3 కోట్లతో నిర్మించేందుకు సర్వే నిర్వహించినట్టు చెప్పారు. నిధులు రాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు.

సచివాలయ ఉద్యోగుల గైర్హాజరుపై ఫిర్యాదు

చింతపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాజంగి గ్రామ సచివాలయం-1 లో ఉద్యోగులు విధులకు గైర్హాజరుకావడంపై కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినట్టు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బోనంగి చిన్నయ్య పడాల్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 12గంటలకు కుల ధ్రువీకరణ పత్రం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కి సచివాలయానికి వెళ్లగా ఒక్క ఉద్యోగి విధుల్లోలేరని, ఖాళీ కుర్చీలు మాత్రమే కనిపించాయన్నారు. వారం రోజులుగా ఉద్యోగులంతా విధులకు గైర్హాజరవుతున్నారన్నారు. ఉన్న తాధికారులు శాఖపరమైన చర్యలు తీసుకోకుంటే ఆందోళన చేపడతామన్నారు.

'ఆశ'ల సమస్యలు పరిష్కరించాలి: ఐద్వా



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు విజయ

పాడేరురూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.విజయ డిమాండ్ చేశారు. స్థానిక పీఎంఆర్సీ భవనంలో గురువారం ఆశ కార్యకర్తల జిల్లా అధ్యక్షురాలు గాసమ్మ అధ్యక్షతన జరిగిన ఆశా కార్యకర్తల జిల్లా ద్వితీయ మహాసభలకు ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఆశాల సంఘం ఏర్పాటు చేసి 25 ఏళ్లలో అనేక సమస్యలను పోరాడి పరిష్కరించుకున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులు ఐక్యంగా పోరాడి తిప్పికొట్టాలన్నారు. ఆశాలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, వారిని పర్మినెంట్ చేయాలని, ప్రజలకు సరిపడే విధంగా ఆశాలకు మందులు సరఫరా చేయాలని, పాడేరు డివిజన్‌లో ఉన్న 725 మంది కమ్యూనిటీ వర్కర్లను ఆశా కార్యకర్తలుగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు, జిల్లా సహాయ కార్యదర్శి లింగేటి సుందరరావు, పాడేరు డివిజన్ 11 మండలాలకు చెందిన 150 మంది ఆశాలు పాల్గొన్నారు..

ముత్యాలమ్మను దర్శించుకున్న ఆర్‌జేడీ

చింతపల్లి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్యాలమ్మను మహిళా శిశు సంక్షేమశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి. చిన్మయిదేవి దర్శించుకున్నారు. గురువారం మండలంలో పర్యటించిన ఆమె అమ్మవారిని దర్శించుకుని పట్టుచీర, సారెను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సీడీపీవోలు శ్రీదేవి, జీవీ రమణ, సూపర్‌వైజర్ భారతి పాల్గొన్నారు.

సమష్టిగానే గంజాయి నిర్మూలన



గంజాయికి వ్యతిరేక ప్రదర్శనలో పాల్గొన్న టీడీపీ ఇన్‌చార్జి ఈశ్వరి, తదితరులు

పాడేరురూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంజాయి నియంత్రణ ప్రజలు, ఉద్యోగులు, యువత భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. ఈగల్ బృందంతో కలిసి ఆమె గురువారం పాడేరు అంబేడ్కర్ కూడలిలో గంజాయి నివారణపై ప్లకార్డుల ప్రదర్శన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గంజాయి సాగు 99 శాతం తగ్గేలా చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఇంకా కొన్ని మారుమూల ప్రాంతాలు, సరిహద్దు గ్రామాల్లో గంజాయి సాగు చేస్తున్నారన్నారని, దీనిని నిరోధానికి ప్రజలందరి సహకారం అవసరమన్నారు. మైదాన, ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యాపారుల వల్ల గంజాయి సాగు, రవాణాతో అమాయక గిరిజనుల జీవితాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయితో కలిగే ప్రభుత్వం గ్రామాల్లో అవగాహన ప్రస్తుతానికి సత్ఫలితాలు ఇస్తుందన్నారు. ప్రస్తుతం గంజాయి సాగుకు విత్తనాలు వేసే సమయమైన ఈగల్ బృందాలు రైతుల్లో అవగాహన తీసుకువచ్చేందుకు కార్యక్రమాలను చేపట్టడం శుభపరిణామమన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బొర్రా నాగరాజు, కూడా కృష్ణారావు, మంచాల మంగతల్లి, బొర్రా విజయరాణి, డప్పోడి వెంకటరమణ, లగిశపల్లి పంచాయతీ సర్పంచ్ లకే పార్వతమ్మ, పద్మావతి, దివ్యలత తదితరులు పాల్గొన్నారు.

రక్షిత పథకాల నిర్వహణకు కమిటీలు



ఎర్నాపల్లిలో ఏర్పాటు చేసిన కమిటీ

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా నిర్మించిన రక్షిత మంచి నీటి పథకాల సంరక్షణకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు సంకాడ కార్యదర్శి జ్యోతిరాణి అన్నారు. గురువారం సంకాడ పంచాయతీ ఎర్నాపల్లి గ్రామంలో గ్రామ కమిటీతో ఆమె సమావేశమయ్యారు. ఈసందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పథకాలు నిర్మించిన గ్రామాల్లో వీటి నిర్వహణకు 15మంది స్థానిక గిరిజనులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఎర్నాపల్లిలో నీటి పథకం నిర్వాహణకు కుటుంబాల నుంచి రూపాయి చొప్పున వసూలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగులమ్మ, కూటమి నాయకులు నాగేంద్ర, చంటిబాబు పాల్గొన్నారు.

అనంతగిరిలో తాగునీటి సమస్య



ట్యాంక్‌ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, జడ్పీటీసీ గంగరాజు

అనంతగిరి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాగునీటికి వారం రోజులుగా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రపంచబ్యాంక్ ఆర్థిక సాయం రూ. 2 కోట్లతో స్థానికంగా ఏడేళ్ల క్రితం గ్రావిటీ మంచినీటి పథకం నిర్మించారు. అయితే, కొద్ది రోజులుగా తాగునీటి పథకం మరమ్మతులకు లోనవు తోంది. దీంతో మొండి జామిగుడ గ్రామంతో పాటు గా మండల కేంద్రంలోని పె ద్దూరు, పీహెచ్‌సీ కాలనీ, బొడ్డచెట్టు కాలనీ వాసులు, గిరిజనులకు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గెడ్డలు, ఊటనీటి సేవించడం ద్వారా రోగాలబారిన పడుతున్నారు. ఈస్థితిలో శుక్రవారం ఉదయం శ్మశానం వద్ద పైపులైన్ మరమ్మతు పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రుక్మంగా హరరాజు ఆధ్వర్యంలో చేపట్టారు. జడ్పీటీసీ గంగరాజు పర్యవేక్షించారు. అలాగే, గ్రామంలో ట్యాంక్ ద్వారా తాగునీటిని సరఫరాకు జడ్పీటీసీ, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు మురళి ప్రత్యేక చొరవచూపారు.త్వరలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడతామని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ, ఏఈ గౌతమ్ తెలిపారు.


ఆర్టీసీ డీఎంను కలిసిన ఈయూ నేతలు



డీఎం శ్రీనివాసరావుతో యూనియన్ నాయకులు

పాడేరురూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బుధవారం బాధ్యత లు చేపట్టిన పి.శ్రీనివాసరావును డిపో ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు చిన్నారావు, అధ్యక్షులు వల్లి, జిల్లా కార్యదర్శి చందులు గురువారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డిపోలో నెలకొన్న సమస్యలు, కార్మికుల కష్టాలను వివరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు హిమ, డిపో కార్యదర్శి సాగిన పరమేశ్, గ్యారేజ్ సెక్రటరీ విజయకుమార్, యూనియన్ నాయకులు ఎస్.ఉష, పి.లక్ష్మి, టి.అన్నపూర్ణ, ఎం.పూర్ణ, సీహెచ్.సతీశ్, పి.ప్రసాద్, జీఎం.రావు, బంగార్రాజు, ఎం.వి. బాబు, పొదలం, ఎస్.ఎల్.రావు, డి.రాజులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు

జి.మాడుగుల: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి శనివారం ఎంఈవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంఈవో బాబూరావు పడాల్ ఆధ్వర్యంలో ఎంపికైన 10 మంది ఉపాధ్యాయులకు అవా ర్డులు ప్రదానం చేశారు. అలాగే స్థానిక గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. హెచ్‌ఎం ఎం.మత్స్యరాజు, ఉపాధ్యాయులు కేసవర్ధన్, నాగమణి, రాంబాబు, లక్ష్మి పాల్గొన్నారు.

కబడ్డీలో ఏపీ ఎలక్ట్రిసిటీ జట్టుకు మూడో స్థానం



జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సీలేరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం యాదాద్రి గుట్టలో నిర్వహించి న 47 వ జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ జట్టు మూడో స్థానంలో నిలిచినట్టు జట్టు మేనేజర్ (సీలేరుకు చెందిన ఏఈఈ) సీహెచ్ సు రేశ్ తెలిపారు. ఏపీ ఎలక్ట్రిసిటీ కా ర్పొరేషన్ జట్టు, తెలంగాణ ఎలక్ట్రిసిటీ బోర్డు జట్లు గురువారం పోటీ పడగా.. 42 - 25 స్కోర్‌తో ఏపీ జట్టు తెలంగాణ జట్టుపై 17 పాయింట్లు ఆధిక్యంతో మూడో స్థానంలో నిలిచింది.

ఆటో బోల్తా పడి విద్యార్థి మృతి

... 3వ పేజీ తరువాయి

ఎక్కారు. కొంతదూరం వెళ్లిన తరువాత కృష్ణాపురం వద్ద ఆటోకు అడ్డుగా పంది వచ్చింది. దీంతో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ క్రమంలో ఆకాశ్‌పై ఆటో పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి ఆటోను పక్కకు తీసి, ఆకాశ్‌ను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. ఆటోలో ప్రయాణిస్తున్న అనీషా, మరో ఇద్దరు ప్రయాణికులు గాయపడ్డారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ ఎం.శ్రావణి, ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ పరిశీలించారు. కాగా ఆకాశ్ నేత్రాలను విశాఖ ఐ బ్యాంకుకు ఇచ్చేందుకు తల్లిదండ్రులు అంగీకరించడంతో వైద్య సిబ్బంది వచ్చి నేత్రాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రక్త దానంలో రికార్డ్

... 3వ పేజీ తరువాయి

అయ్యన్నపాత్రుడు రక్తదాన శిబిరాలు ప్రారంభించారు. రక్త దాతలను ఆయనతో పాటు 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ అభినందించారు.

బ్లడ్ ప్రాసెసింగ్ చార్జీలు తగ్గించడానికి కృషి: అయ్యన్న

రక్తదాన శిబిరాల్లో దాత నుంచి సేకరించిన తర్వాత బ్లడ్‌ను ప్రాసెస్ చేయడానికి ఖర్చు అధికమవ్వడం వల్ల ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల్లో అధిక ధరకు రక్తం యూనిట్లను విక్రయిస్తున్నారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ఈ ఖర్చుని తగ్గించడానికి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి, తగు చర్యలు తీసుకుంటానని చెప్పారు. బ్లడ్ ప్రాసెసింగ్ ఖర్చు తగ్గితే ప్రైవేటు బ్లడ్ బ్యాంకుల్లో అందుబాటు ధరలకు రక్తం లభిస్తుందని తెలిపారు.

జిల్లాలో 39 మంది ఉత్తమ గురువులు

... 3వ పేజీ తరువాయి

జీహెచ్‌ఎస్, తానాం, పరవాడ మండలం; డి.కాళిదాస్, జడ్పీహెచ్‌ఎస్, కశింకోట.

ఎస్‌జీటీ విభాగంలో....

జీవీ రామన్న, ఎంపీపీఎస్, భీమవరం ఎస్.రాయవరం మండలం; చిలికళ్ల దేవి, ఎంపీయూపీఎస్, చెట్టుపాలెం, మాకవరపాలెం మండలం; డీఆర్‌కే శాస్త్రి ఎంపీపీఎస్, దేవవరం, నక్కపల్లి మండలం; కె.సతీశ్, ఎంపీపీఎస్, డీఎల్ పురం-1, నక్కపల్లి మండలం; వి.శ్రీనివాసరావు, ఎంపీపీఎస్, గొల్లలపాలెం, కె.కోటపాడు మండలం; బీవీహెచ్ చంద్రశేఖర్, ఎంపీపీఎస్, వెలంకాయలపాలెం, రోలుగుంట మండలం; బొడ్డు అప్పలనాయుడు, ఎంపీపీఎస్, చౌడువాడ, కె.కోటపాడు మండలం; కె.బంగారయ్య, ఎంపీపీఎస్, పిండ్రంగి, కె.కోటపాడు మండలం; ఎన్.రామ, ఎంపీపీఎస్, ఎన్‌సీడీఎం, వడ్డాది, బుచ్చెయ్యపేట మండలం; ఇందాన అనిత, ఎంపీపీఎస్, బొడ్డువలస, సబ్బవరం మండలం; కె.దానిమ్మనాయుడు, ఎంపీపీఎస్, పాత వాలాబు, దేవరాపల్లి మండలం; కె.రాజేశ్, చినదొడ్డిగల్లు-2, నక్కపల్లి మండలం; కేఎన్ సుభాస్‌చంద్ర, ఎంపీయూపీఎస్, తామర్బ, దేవరాపల్లి మండలం.

ప్రధానోపాధ్యాయుల విభాగంలో....

ఎన్.శ్రీనివాసరావు, జడ్పీహెచ్‌ఎస్, వాడచీపురుపల్లి, పరవాడ మండలం; డి.వరహామూర్తి, జడ్పీహెచ్‌ఎస్, వరహాపురం, చీడికాడ మండలం; డీఎస్ భవాని, జడ్పీ జీహెచ్‌ఎస్, పాయకరావుపేట; కేవీ మాధవి, జడ్పీ జీహెచ్‌ఎస్, నర్సీపట్నం; ఆర్‌వీ జగదీశ్, జడ్పీహెచ్‌ఎస్, నానిగిరపాడు, సబ్బవరం మండలం; పి.మల్లికార్జునరావు, జడ్పీహెచ్‌ఎస్, పీఎస్ పేట, చోడవరం మండలం.

ఎరువుల కొరత లేదు

... 3వ పేజీ తరువాయి

వారంలో 60 టన్నులు, మూడో వారంలో 60 టన్నులు ఇస్తామన్నారు. ప్రైవేటు డీలర్లు ఎ క్కువ ధరకు ఎరువులు అమ్మితే లైసెన్సు రద్దు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రైతులు యూరియా, పొటాష్, డీఏపీ ఎరువులను నిర్ణీత మోతాదులో పంటలకు వేయాలని, కానీ పొటాష్, డీఏపీ రేటు ఎక్కువ వుండడంతో కొంతమంది రైతులు యూరియాను మోతాదుకు మించి వాడుతున్నట్టు తమ సిబ్బంది దృష్టికి వచ్చిందన్నారు. దీనివల్ల ఇతర రైతులకు సకాలంలో యూరియా అందదని అన్నారు. వీరి వెంట తహశీల్దారు లక్ష్మీదేవి, వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ, విస్తరణ అధికారి కిరణ్‌కుమార్, ఎస్‌ఐ పి.సత్యనారాయణ వున్నారు.

ఉత్తమ అధ్యాపకునిగా చిన్నారావు ఎంపిక

... 3వ పేజీ తరువాయి

ఇంటర్మీడియట్ బోర్డు సీనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరారు. 2008లో జిల్లాస్థాయి ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు. అదే ఏడాది పదోన్నతిపై నర్సీపట్నం జూనియర్ కళాశాల లెక్చరర్‌గా చేరారు. తరువాత వేములపూడి కళాశాలలో కూడా కొంతకాలం పని చేశారు. మూడేళ్ల నుంచి నర్సీపట్నం కళాశాల ఎఫ్‌ఏసీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. పదోన్నతిపై ఇటీవల వడ్డాది జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. నర్సీపట్నంలో విధులు నిర్వహించినప్పుడు లయన్స్ క్లబ్ సహకారంతో రూ.20 లక్షలతో గ్రంథాలయం ఏర్పాటు చేశారు.

యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దు

» రైతు సేవా కేంద్రం వద్ద వ్యవసాయ సిబ్బంది, వీఆర్వో, సర్పంచ్, రైతు సంఘాల్లో ఒకరు ఉండి విక్రయాలు

» సమీక్షా సమావేశంలో మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్‌రావు


సిబ్బంది సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రావు

మాకవరపాలెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం రైతులు ఆందోళన చెందవద్దని మండల ప్రత్యేకాధికారి రామ్మోహన్ రావు స్పష్టం చేశారు. సరిపడిన యూరియా ఉన్నట్టు చెప్పారు. ఇక్కడి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వ్యవసాయ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ప్రతి రైతు సేవా కేంద్రం వద్ద వ్యవసాయ సిబ్బందితో పాటు వీఆర్వో, సర్పంచ్, రైతు సంఘాల్లో ఒకరు ఉండి యూరియా అమ్మకాలు జరపాలన్నారు. అలాగే ప్రతి ప్రైవేటు షాపు వద్ద వీఆర్వోను ఉంచి వారి ద్వారా యూరియా అమ్మకాలు చేపట్టాలని సూచించారు. రానున్న పదిహేను రోజుల్లో యూరియా కొరత లేకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ప్రతి రైతుకు సరిపడినంత మేర యూరియా అందజేయాలన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ వెంకటరమణ, వ్యవసాయాధికారి డి.అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీ పాఠశాలకు బెంచీలు, కుర్చీల వితరణ


బెంచీలు, కుర్చీలు అందజేసిన రోటరీ క్లబ్ ప్రతినిధులు

నర్సీపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పెదబొడ్డేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విశాఖపట్నం రోటరీ క్లబ్ ప్రతినిధులు టేబుళ్లు, కుర్చీలను గురువారం వితరణగా అందజేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు వీవీ రఘుపతి రూ.50 వేలు వెచ్చించి వీటిని కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం గొట్టేటి రవి మాట్లాడుతూ ఐదో తరగతి విద్యార్థులు కుర్చొనేందుకు బల్లలు అవసరమని వారి దృష్టికి తీసుకె వెళ్లామని, త్వరలో సమకూర్చుతామని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారన్నారు. రోటరీ క్లబ్ కార్యదర్శి వంశీమోహన్, మద్ది జగన్‌మోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నాతవరం టీడీపీ కార్యాలయంలో అయ్యన్న జన్మదిన కేక్‌కట్ చేస్తున్న నాయకులు


అయ్యన్నకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇమ్మాన్యుయేలు సంస్థ అధినేత జీవన్‌రాయ్

ఘనంగా అయ్యన్న జన్మదిన వేడుకలు


అయ్యన్న దంపతులకు శాలువా కప్పి జ్ఞాపికను అందజేస్తున్న అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్, వేద పండితు

నర్సీపట్నం/మాకవరపాలెం/కృష్ణాదేవిపేట/ నాతవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్పీకర్ అయ్యన్న పాత్రుడు జన్మదిన వేడుకలు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గురువారం ఘనంగా జరిగాయి. నర్సీపట్నంలో మరింత కోలాహలంగా సాగాయి. పెద్ద సంఖ్యలో కూటమి శ్రేణులు, వివిధ శాఖల అధికారులు, అభిమానులు హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇదిలావుంటే, మాకవరపాలెంలో టీడీపీ నాయకుడు రుత్తల నాని ఆధ్వర్యంలో ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. బీఎస్‌పేట, భీమబోయినపాలెం, శెట్టిపాలెం, గిడుతూరు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో యువకులు రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. ఇమ్మాన్యుయేలు సంస్థ అధినేత జీవన్‌రాయ్ విద్యార్థులతో కలిసి అయ్యన్నపాత్రుడికి శుభాకంక్షలు తెలియజేశారు. అలాగే, గొలుగొండ మండలంలో టీడీపీ మండల అధ్యక్షుడు చిటికెల తారకవేణుగోపాల్ ఆధ్వర్యంలో అయ్యన్న జన్మదిన వేడుకలు పండగ వాతావరణంలో జరిగాయి. అన్ని పంచాయతీల నుంచి మూడు వందల మంది వరకు ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై రక్తదానం చేశారు. ఏఎల్‌పురం, లింగంపేట, చోద్యం తదితర గ్రామాల్లో కేక్‌కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం వృద్ధులకు పాలు, రొట్టెలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ తారకవేణుగోపాల్, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, గొల్లి సత్యనారాయణ, గోవింద్, రవివర్మ, శ్రీకాంత్ బాబ్జి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నాతవరం టీడీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం స్పీకర్ అయ్యన్నపాత్రుడు జన్మదిన వేడుకలను పార్టీ గ్రామ అధ్యక్షుడు పైల సూరిబాబు ఆధ్వర్యంలో జరిగాయి. నాయకులు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ ఈ ఏడాది అయ్యన్న జన్మదినాన్ని పురస్కరించుకుని నాతవరం మండలం నుంచి 250 మంది యువకులు రక్తదానం శిబిరంలో భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ వేడుకల్లో టీడీపీ నాయకులు ఎన్.విజయ్‌కుమార్, అపిరెడ్డి మాణిక్యం, పారుపల్లి దాసు, శెట్టి నానాజీ, జీరెడ్డి రాజుబాబు, ఇటంశెట్టి సీతారామ్మూర్తి, శెట్టి సత్యనారాయణ, చింతకాయల శ్రీనివాసు, గుడపర్తి రాము నాయుడు, శెట్టి లోవ, ప్రభుదాసు, అంకంరెడ్డి చిన జమీలు తదితరులు పాల్గొన్నారు.


కృష్ణాదేవిపేట రక్తదానం శిబిరంలో తారకవేణుగోపాల్, టీడీపీ నాయకులు

జూనియర్ కళాశాలలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే


విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

నర్సీపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డేను గురువారం ఉత్సాహంగా జరుపుకున్నారు. ముందుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలికారు. అనంతరం వారంతా సినీ, జానపద గీతాలకు డ్యాన్స్‌లు చేస్తూ జోష్ పుట్టించారు. ఈ కార్యక్రమంలో బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.శోభ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

గురువు ద్వారానే గమ్యం

ఉపాధ్యాయ దినోత్సవంలో రాధాకృష్ణన్ మనుమడు డాక్టర్ సుబ్రహ్మణ్య శర్మ


డైట్ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సుబ్రహ్మణ్యశర్మ.

తుమ్మపాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :ప్రతి విద్యార్థి ఉపాధ్యాయులను జీవిత మార్గదర్శకులుగా చూడాలని భారత మాజీ రాష్ట్రపతి దివంగత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ మనుమడు డాక్టర్ సుబ్రహ్మణ్య శర్మ అన్నారు. అనకాపల్లిలోని డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశంలో ప్రతి విద్యార్థిని ప్రభావితం చేశారన్నారు. గురువు ద్వారానే గమ్యం అన్న భావనను ప్రతి ఒక్కరిలో కల్పించారని వివరించారు. ఉపాధ్యాయులకు మాత్రమే సమాజాన్ని మలచగల శక్తి ఉంటుందన్నారు. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. డైట్ కళాశాల సాధించిన విజయాలను ప్రశంసించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి అందరూ కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, అధ్యాపక సిబ్బంది డాక్టర్ కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ మండలంలో...

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, నాగాపురం, కొంగసింగి తదితర గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీహరి, అదనపు ప్రిన్సిపాల్ రుత్తల గంగరాజు, ఎంఈవో-2 కృష్ణప్రసాద్, హెచ్ఎంలు నర్సింహమూర్తి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సహకార సంఘాలను గాడిలో పెట్టండి: ఎమ్మెల్యే


జన్నవరం పాలకవర్గం ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, సెప్టెంబరు3 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హ యాంలో భ్రష్టుపట్టిన సహకార సంఘాలను గాడిలో పెట్టాలని స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సూచించారు. గురువారం మండలంలోని జన్నవరం ప్రాథమిక సహకార సంఘం చైర్‌పర్సన్, పర్సన్‌ల పదవీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సహకార సంఘాలను సమర్థంగా నిర్వహించి రైతులకు సేవలందించాలన్నారు. ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న పథకాలను అందించవలసిన బాధ్యత పాలకవర్గాలపై ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా సహకారసంఘాలను నడిపించి వ్యవస్థను నిర్వీర్యం చేశారని, వాటిని చక్కదిద్దాలని పాలక వర్గ సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌గా మజ్జి గౌరీశంకర్, సభ్యులుగా ఎలిశెట్టి శ్రీనివాసరావు, ఓటేటీ నరశింగరావులతో ఎమ్మెల్యే రాజు ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, రొంగలి రమణ, బర్ల తాతయ్యలు, ఏటవతల గ్రామాల సర్పంచ్‌లు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా ఎస్టీ హాస్టల్ భవనం


ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న ఐటీడీపీ ఇన్‌చార్జి సురేశ్ కుమార్

రోలుగుంట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ హైస్కూల్ ఆనుకుని ఉన్న వినియోగంలో లేని ఎస్టీ హాస్టల్ భవనం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారినట్టు గ్రామ ఐటీడీపీ ఇన్‌చార్జి బనిశెల సురేశ్‌కుమార్ ఎంపీడీఓ నాగేశ్వరరావుకు గురువారం ఫిర్యాదు చేశారు. దీనిపై ఏడాది క్రితమే ఫిర్యాదు చేసినా నేటికీ చర్యలు తీసుకోలేదని విన్నవించారు. పదేళ్ల క్రితం ఈ ఎస్టీ హాస్టల్‌ను ప్రభుత్వం ఎత్తివేయడంతో అప్పటి నుంచి వృథాగా ఉందన్నారు. దీంతో ఈ భవనంలో తరచూ మద్యం, గంజాయి సేవనం చేసేవారికి అడ్డాగా మారిందన్నారు. దీంతో పక్కనే ఉన్న పాఠశాల పిల్లలు, గ్రంథాలయ పాఠకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఈ భవనాన్ని ఆధీనంలోకి తీసుకుని ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగించాలని కోరారు.

ఎరువుల కొరత లేకుండా చర్యలు: ఏడీఏ


రైతులతో మాట్లాడుతున్న నర్సీపట్నం ఏడీఏ శ్రీదేవి

మాడుగుల రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎరువుల కొరత లేకుండా తగిన చర్యలు చేపడుతున్నామని నర్సీపట్నం డివిజన్ ఏడీఏ శ్రీదేవి తెలిపారు. గురువారం స్థానిక పీఏసీఎస్, మండలంలోని పలు ఆర్ఎస్‌కేలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. పీఏసీఎస్‌లు, రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తున్నామన్నారు. యూరియా కొరత లేకుండా తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. నర్సీపట్నం డివిజన్ పరిధిలో 10765 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారని, 940 హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నారని చెప్పారు. ఆయా పంటల విస్తీర్ణం బట్టి యూరియా,డీఏపీ కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచుతున్నామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. ఎరువుల నిర్ణీత ధరలకు మాత్రమే విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నర్సీపట్నం డివిజన్ పరిధిలో 1571 టన్నుల యూరియా సరఫరా చేశామని, మరో 1500 టన్నుల కోసం ఇండెంట్ పెట్టామన్నారు. ప్రస్తుతం 73టన్నుల యూరియా నిల్వ ఉందని చెప్పారు. రైతులు సిఫార్సు మేరకు ఎరువుల వినియోగించాలని అధిక మోతాదులో వాడొద్దని సూచించారు. పశుగ్రాసం సాగు కోసం యూరియా వాడకంతో సమస్యలు వస్తున్నాయన్నారు. పశుగ్రాసం ఎదుగుదల కోసం నానో యూరియా , నానో డీఏపీ వంటి ద్రావణాలు అందుబాటులోఉన్నాయన్నారు. డివిజన్ పరిధిలో 1500 టన్నుల యూరియా అందిస్తున్నామని చెప్పారు. మాడుగుల మండలానికి 865 టన్నులు అవసరం కాగా, 451 టన్నుల యూరియా సరఫరా చేసినట్టు చెప్పారు. ఇంకా 414 టన్నులు సరఫరా చేయాల్సి ఉందన్నారు. ఈమె వెంట ఏవో అనసూయ, సిబ్బంది సత్యనారాయణ, జగ్గారావు ఉన్నారు.

చీడికాడకు త్వరలో 72మెట్రిక్ టన్నుల యూరియా

చీడికాడ: మండలానికి 72 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరాకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎంపీడీవో హేమసుందర్రావు తెలిపారు. మండలంలో దండిసురవరం పీఏసీఎస్ కార్యాలయాన్ని తహసీల్దార్ కిశోర్‌లింకన్, స్థానిక వ్యవసాయ అధికారి ఎ.కృష్ణవేణితో కలిసి గురువారం పరిశీలించారు. ఇటీవల ప్రభుత్వం నుంచి ఈ సొసైటీకి కేటాయించిన ఎరువులపై ఆరాతీశారు.రికార్డులను పరిశీలిం చారు. సొసైటీలో ఉన్న ఎరువుల గోదాములను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు మా ట్లాడుతూ, మండలంలో పలు రైతు సేవా కేంద్రాలకు ఇప్పటికే 200 టన్నులు ఎరువులను ప్రభుత్వం కేటా యించిందన్నారు. నాలుగైదురోజుల్లో జైతవరం, ఖండివరం, జి.కొత్తపల్లి, చుక్కపల్లి, అర్జునగిరి, బైలపూడి, చీడికాడ రైతుసేవా కేంద్రాలకు మరో 72మెట్రిక్ టన్నులు సరఫరాకానున్నట్టు చెప్పారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

బుచ్చెయ్యపేటలో 30 టన్నులు

బుచ్చెయ్యపేట సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి) మండలంలో సూమారు 30 మెట్రిక్ టన్నులు యూరియా నిల్వలు సిద్ధంగా ఉన్నట్టు మండల వ్యవసాయధికారి భాస్కరరావు తెలిపారు. వడ్డాది, పెదమదిన, కేపీ అగ్రహారం రైతు సేవా కేంద్రాల్లో రైతులు ఆధార్ జీరాక్స్, వన్‌బి తీసుకువెళ్లాలని రైతులకు సూచించారు. మరో మూడు రోజుల్లో మిగిలిన రైతు సేవా కేంద్రాల్లో యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

చీడికాడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మూడు కిలోల గంజాయితో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి చోడవరం కోర్టుకు తరలించినట్టు స్థానిక ఎస్ఐ సతీష్ తెలిపారు. విశాఖకు చెందిన గోడాడి హరి సంపత్, రేవాడ కిరణ్ ఒడిశా నుంచి ఈ గంజాయిని బైక్‌పై తీసుకువస్తుండగా బుధవారం సాయంత్రం కోనాం శివారు గుడివాడ వద్ద ముందస్తు సమాచారం మేరకు వీరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద ఉన్న బైక్, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్టట ఎస్ఐ చెప్పారు.

అధికారుల ఆదేశాలకు విరుద్ధంగా గురుపూజోత్సవం


మాడుగుల జడ్పీ హైస్కూల్‌లో పాఠశాలలో గురుపూజోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మాడుగుల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పలు పాఠశాలల్లో ముందు రోజైన గురువారం జరపడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏటా సెప్టెంబరు 5వ తేదీన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తారు. అయితే, 5వ తేదీన ఈద్ మి లాన్ అన్‌నబీ) సెలవుకావడంతో ముందురోజైన గురువారం గురుపూజోత్సవం జరిపారు. 5వ తేదీనే ఉపాధ్యాయ దినోత్సవం జరపాలని డీఈవో ఆదేశాలకు విరుద్ధంగా మాడుగుల జడ్పీ పాఠశాల, ఒమ్మలి పాఠశాలతో పాటు పలు ప్రైవేటు విద్యా సంస్థల్లో 4వ తేదీన గురుపూజోత్సవం జరిపారు. విషయంపై ఎంఈవో దేముడమ్మ వద్ద ప్రస్తావించగా గురుపూజోత్సవం సెప్టెంబరు 5వ తేదీన జరపాలని డీఈవో ఇచ్చిన ఆదేశాలను పాఠశాలల హెచ్‌ఎంలకు పంపించామన్నారు. ముందు రోజు ఈ కార్యక్రమం నిర్వహించడంపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానాలు


ఏజెంట్ రామప్పారావు దంపతులను సత్కరిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

చోడవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతంలోపేపర్ ఏ జెంట్‌గా సుదీర్ఘకాలం సేవలందించిన యల్లపు రామప్పారావును మం డలంలోని వెంకన్నపాలెం వాసవీ క్లబ్ సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. వాసవీ క్లబ్ ఉత్సవాలలో భాగంగా గురువారం వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సత్కరించారు. ఈ సం దర్భంగా మూడు దశాబ్దాలుగా పత్రికా ఏజెంటుగా సేవలందిస్తున్న రామప్పారావు దంపతులను వాసవీక్లబ్ నాయకులు కేదారిశెట్టి గుప్తా, కార్యదర్శి భవిరిశెట్టి నగేశ్, రాయపురాజుపేటసర్పంచ్ బొడ్డేడ రామునాయుడు సత్కరించారు. కూర్మదాసు ప్ర సాద్‌గుప్తా, సురేశ్, సోమేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు కిత్తంపేటలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

రావికమతం,సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జెడ్. బెన్నవరం పంచాయతీ శివారు కిత్తంపేటలో తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత ఎన్టీ రామారావు విగ్రహాన్ని శుక్రవారం ఆవిష్కరిస్తున్నారు. రామాలయం సమీపంలో నూతనంగా ఆ గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటు చేసిన ఈ విగ్రహాష్కరణలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు తదితరులు పాల్గొననున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని టీడీపీ మండల అధ్యక్షులు కోమటి శంకరావు, మాజీ సర్పంచ్ అర్జున తెలిపారు.

అన్న సమారాధనలు

రావికమతం, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): గుమ్మాళ్ళపాడులో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గురువారం మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. గణేష్ ఉత్సవ 16వ వార్షికోత్సం పురస్కరించుకుని 16 రకాల ఆహర పదార్థాలతో భారీ అన్న సమారాధనను యూత్ కమిటీవారు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. కొత్తకోటలో నందీశ్వర యూత్ సభ్యులు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం నిమజ్జనోత్స వంలో ఏర్పాటు చేసిన కోలాటాలు ఆకట్టుకున్నాయి.


గుమ్మాళ్ళపాడులో 16 రకాలతో అన్న ప్రసాదాన్ని వడ్డిస్తున్న నిర్వాహకులు

కె. కోటపాడులో..

కె.కోటపాడు: స్థానిక రెల్లివీధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను మాజీ సర్పంచ్ లక్ష్మీ నరసింహమూర్తి ప్రారంభించారు. పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రెల్లి పెద్దలు వడ్డాది కోటేశ్వరరావు, భూపతి కోటేశ్వరరావు, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జట్టుకు టీషర్టులు పంపిణీ


తామరబ్బలో టీషర్టులు ఇస్తున్న తమ్మయ్య తదితరులు

దేవరాపల్లి: తామరబ్బ పంచాయతీ బొడ్డపాడులో వినాయక నవరాత్రుల్లో భాగంగా కబడ్డీ జట్టుకు టీడీపీ నాయకుడు మొ సలి.తమ్మయ్య టీషర్టులను గురువారం అందజేశారు. ముందుగా అన్న సమారాధన నిర్వహించారు. ఎ. కొత్తపల్లిలో అన్న సమారాధన నిర్వహించారు. ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, సర్పంచ్ వెంకటరమణ పాల్గొన్నారు.

కన్నతండ్రే కాలయముడు

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో హెడ్ ఆఫ్ బ్రాండ్స్‌గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- » కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- » ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- » తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- » తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- » సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెర నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుదిశ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

వెల్లువెత్తిన అభిమానం

- » ఘనంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు జన్మదిన వేడుకలు
- » శుభాకాంక్షలు తెలియజేసిన టీడీపీ శ్రేణులు, అభిమానులు


స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి అనకాపల్లి నూకాంబిక అమ్మవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద్ సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, మళ్ల సురేంద్ర, ఇతర నేతలు

నర్సీపట్నం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జన్మదిన వేడుకలను గురువారం నర్సీపట్నం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తెలుగుదేశం పార్టీ శ్రేణులు, అయ్యన్న అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అయ్యన్నపాత్రుడు నివాసానికి ఉదయమే పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు తరలివచ్చి, ఆయనకు పుష్పగుచ్ఛాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దీంతో ప్రాంగణం కిక్కిరిసి పోయింది. అన్నవరం వీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానం ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్, వేద పండితులు వచ్చి స్పీకర్ దంపతులకు శాలువా కప్పి, సత్యనారాయణ స్వామి చిత్రపటాన్ని అందజేశారు. రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, గవర కార్పొరేషన్ మళ్ల సురేంద్ర తదితరులు స్పీకర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి అనకాపల్లి నూకాంబిక అమ్మవారి నూకాలమ్మ చిత్రపటాన్ని అందజేశారు. ప్రాంతీయ ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద, వైద్య బృందం కేక్ కట్ చేయించి స్వీట్లు పంపిణీ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జ్యోతి పుష్పగుచ్ఛం అందజేశారు. ఏరియా ఆస్పత్రి ఆపరేషన్ థియేటర్‌లో రూ.4 లక్షలతో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ ఆక్సిజన్ పనులకు అయ్యన్నపాత్రుడు కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆస్పత్రిలో సేవలు మెరుగుపడ్డాయని, రూ.47 లక్షలతో ఆస్పత్రిలో డ్రైనేజీ పైప్‌లైన్, ఇతర మరమ్మతు పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ప్రసవం కోసం వచ్చే గిరిజన మహిళలు వేచివుండేందుకు ప్రత్యేక సదుపాయం కల్పిస్తున్నట్టు తెలిపారు. ఖాళీగా ఉన్న వైద్యుల నివాసగృహాలకు మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పారు.

8 నుంచి రాష్ట్ర స్థాయి మహిళా కబడ్డీ పోటీలు

లంకెలపాలెం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 84వ వార్డు పరిధి సాలాపువానిపాలెంలో వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని సీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి రాష్ట్ర స్థాయి ఆహ్వానపు మహిళా కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించనున్నట్టు సంఘం ప్రతినిధి సాలాపు మోహన్‌రావు తెలిపారు రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధుల పర్యవేక్షణలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ పోటీల్లో ఒకటి, రెండు, మూడు, నాలుగు స్థానాల్లో నిలిచే విజేతలకు వరసుగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు నగదు బహుమతి ఇస్తామని పేర్కొన్నారు. అలాగే పురుషులకు జిల్లా స్థాయిలో కబడ్డీ పోటీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు కమిటీని సంప్రతించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9949510771 ఫోన్ నంబరును సంప్రతించాలని ఆయన కోరారు.

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్‌గా శ్రీరామ్మూర్తి


శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వడ్డాది గ్రామానికి చెందిన శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తిని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఆరుగురు డైరెక్టర్లు ఉండగా ఉత్తరాంధ్ర నుంచి శ్రీరామ్మూర్తికి మాత్రమే అవకాశం లభించింది. తెలుగుదేశం పార్టీకి ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన అధిష్ఠానం, స్థానిక ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సిఫారసుతో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది.



రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడి మృతి


గుర్తు తెలియని యువకుడి మృతదేహం

పరవాడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడని సీఐ ఆర్.మల్లికార్జునరావు తెలిపారు. దీనికి సంబంధించి ఆయన వెల్లడించిన వివరాలు ఇలా వున్నాయి. ఫార్మాసిటీలోని అరబిందో ఫార్మా పరిశ్రమ సమీపంలోని రహదారిపై బుధవారం సాయంత్రం నడిచి వెళుతున్న ఒక యువకుడిని వ్యాన్ ఢీకొన్నది. అతనికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చ్యురీలో భద్రపరిచారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే 9440796038 నంబరును సంప్రతించాలని సీఐ కోరారు. ఈ మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	121.00
లైవ్ ధర	141.00
విత్ స్కిన్	252.00
స్కిన్ లెస్	262.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	555
విజయనగరం	559
శ్రీకాకుళం	559